# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 15-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:267 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

సామాన్య జనుల కొసగగ
గ్రామీణోపాధి లోని లాభాంశములన్
ప్రాముఖ్యముగల పనులిడె
ధీమతి రేవంత రెడ్డి తెలగాణములోన్ !!

(పన్నెండు కోట్ల పనిదినాలతో కనీసం నూట ఇరవై ఐదు పనిరోజులతో ఐదు లక్షల బీద కుటుంబాలకు లాభం జరిగేటట్లు తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీబీ జీరామ్ జీ గ్రామీణ ఉపాధి పథకానికి రూపకల్పన చేశారు.) -రాధశ్రీ

సెల్:9494481210



**చురక**

కష్టమైనా నష్టమైనా
కళేశ్వరం నీళ్లు
కదిలించే ప్రయత్నం
కనిపించక కన్నీళ్లు.
సర్కారు పంతాలు
సమస్యను తీర్చలేవు
వర్షాభావ గడ్డుస్థితిని
విమర్శలు మార్చలేవు.

-వేల్పుల నారాయణ
9440433475



# రక్తం ప్యాకెట్లతో రాజకీయం అవసరం లేదు..

## – బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ఫైర్



హైదరాబాద్, జులై 14: బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కృంగిపోయిందని తెలిపారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి రావాలంటే ఏం చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు.

ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరఫున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# భారతీయుడి మృతిపై కేంద్రం ఆగ్రహం..

## ఇరాన్ రాయబారికి సమన్‌లు జారీ

న్యూఢిల్లీ, జులై 14: హర్మూజ్ జలసంధి లో యూఏఈ కి చెందిన చమురు ట్యాంకర్ల (రాతిశ్రీ బిజీనిఎవతీబ) పై ఇటీవల ఇరాన్ జరిపిన దాడిలో ఓ భారతీయుడు మరణించాడు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ ఘటనకు సంబంధించి భారత్ లోని ఇరాన్ రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ మహ్మద్ జావెద్ హుస్సేనీ ని విదేశాంగ శాఖ పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసింది. ఘటనపై వివరణ ఇవ్వాలంటూ సమన్‌లు జారీచేసింది.

ఒమన్‌కు సమీపంలోని హర్మూజ్ జలసంధి దక్షిణ మార్గంలో ప్రయాణిస్తున్న 'మొంబాసా', 'అల్ బహియాహ్' చమురు ట్యాంకర్లపై ఇటీవల దాడి జరిగింది. ఈ దాడిలో 'మొంబాసా' నౌకలో పనిచేస్తున్న ఓ భారతీయ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడగా, వారిలో ఆరుగురు భారతీయులు, ఇద్దరు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారు. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

దాడి కారణంగా రెండు ట్యాంకర్లలోనూ మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. అయితే వెంటనే సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో రెండు నౌకలకు భారీ నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఈ దాడిని అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా యూఏఈ రక్షణ మంత్రిత్వ శాఖ ఖండించింది. ప్రాంతీయ భద్రత, స్థిరత్వానికి ఇది తీవ్ర ముప్పు అని అభివర్ణించింది.

ఈ పరిణామంపై స్పందించే పూర్తి హక్కు యూఏఈకి ఉందని స్పష్టంచేసింది. దేశ భద్రత, ప్రజలు, జాతీయ ప్రయోజనాలు, కీలక ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

# చైనాను వణికిస్తున్న టైఫూన్ 'బావి'..

## తెగిపడిన లైట్‌హౌస్ హైటెన్షన్ విద్యుత్ లైన్

న్యూఢిల్లీ, జులై 14:చైనాలో టైఫూన్ బావి బీభత్సం సృష్టిస్తోంది. ఈ తుఫాను ప్రభావంతో లియావోనింగ్ ప్రావిన్స్‌లో భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. దీంతో 2,60,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించినట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం కూడా పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. టైఫూన్ బావి భారీ స్థాయిలో ఉష్ణ మండల తేమను ఉత్తర చైనా వైపు తీసుకురావడంతో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించింది.

లియావోనింగ్ రాజధాని షెన్యాంగ్‌లో వరద ఉధృతికి ఓ లైట్‌హౌస్‌కు చెందిన హైటెన్షన్ విద్యుత్ లైన్ తెగిపోయింది. అది వరద నీటిలో కొట్టుకుపోతూ ప్రధాన రహదారులపై, వంతెన కిందుగా తేలుతూ వెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తుఫాన్ తీవ్రత దృష్ట్యా అన్ని పాఠశాలలు, శిక్షణ సంస్థలకు సెలవులు ప్రకటించారు. షెన్యాంగ్, జిలిన్ సహా పలు ఈశాన్య నగరాల్లో రవాణా సేవలు కూడా నిలిచిపోయాయి.

13 రోజుల క్రితం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్.. ఫ్రాన్స్ దేశమంత విస్తీర్ణాన్ని కలిగి ఉంది.

శనివారం రాత్రి తూర్పు చైనాలో తీరం దాటినప్పటికీ దాని ప్రభావం ఇంకా కొనసాగుతోందని వాతావరణ నిపుణులు తెలిపారు.

దీంతో ఆసియా- పసిఫిక్ ప్రాంతంలో ఈ ఏడాది అత్యంత ఎక్కువ కాలం కొనసాగిన ఉష్ణ మండల తుఫాన్‌గా టైఫూన్ నిలిచింది. చైనా వాతావరణ శాస్త్రవేత్తల ప్రకారం, తుఫాన్‌లోని 'వార్మ్ కోర్' (వెచ్చని కేంద్ర భాగం) బలంగా ఉండటంతో టైఫూన్ భారీ తేమను నిల్వ చేసుకుంటూ ఉత్తర దిశగా, కొరియా ద్వీపకల్పం వైపు కదులుతోంది. తుఫాన్ వేగం తగ్గే కొద్దీ అందులోని తేమ ఒక్కసారిగా విడుదలై మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.

# వర్షాలు కురువాలని బసవేశ్వర ఆలయంలో రైతుల ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్, జులై 14: ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతుల కళ్లలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. వరుణదేవుడు ముఖం చాటేయడంతో పొలాల్లో పచ్చదనం కరువై, రైతుల గుండెల్లో గుబులు మొదలైంది. వర్షాల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్న రైతులు చివరకు దైవాన్ని ఆశ్రయించారు. నారాయణపేట జిల్లా

ఊట్కూర్ మండల కేంద్రం దంతన్‌పల్లి శివారులోని ప్రసిద్ధ మూకి బసవేశ్వర ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ రైతులు, భక్తులు డప్పుల మోతతో ఆలయానికి చేరుకుని శివుడికి జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయాన్ని జలదిగ్బంధనం చేసి, వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురిపించాలని ప్రార్థించారు.

ప్రస్తుతం మండలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో వర్షాలపై ఆధారపడి సాగు చేసిన పత్తి, కంది, ఆముదం పంటలు నీరందక ఓడుముఖం పడుతున్నాయి. మొక్కలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రకృతి అనుకూలించాలని, పంటలు కాపాడాలని కోరుతూ భజనలు, పూజలతో వరుణదేవుడిని వేడుకోవడం గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తున్న అరుదైన దృశ్యంగా మారింది.గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "రైతు బతికితేనే ఊరు బతుకుతుంది. మంచి వర్షాలు కురిసి పంటలు పండాలని భగవంతుడిని వేడుకున్నాం" అని తెలిపారు.

# తెలంగాణ అభివృద్ధి కోసం విమానాశ్రయాలు అవసరం: సీఎం రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ, జులై 14: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై చర్చించారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్, ఎంపీ రఘువీర్ రెడ్డి, రాష్ట్ర అధికారులు సమావేశమై రీజినల్ రింగ్ రోడ్డు తో పాటు తెలంగాణలోని పలు జాతీయ రహదారుల నిర్మాణాల గురించి మాట్లాడారు.

ఈ సమావేశంలో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 95 శాతం భూసేకరణ పూర్తయిందని సీఎం వివరించారు. ఉత్తర భాగం పనులు ప్రారంభించేందుకు కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలని నితిన్ గడ్కరీని కోరారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగానికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన కేంద్ర అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హైదరాబాద్ – అమరావతి మధ్య 12వ వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టాలని కూడా సీఎం రేవంత్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

మరోవైపు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ రఘువీర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలోని అదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న విమానాశ్రయాల అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా అదిలాబాద్ విమానాశ్రయం, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించిన డిజైన్, మౌలిక వసతుల కల్పన, నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. ఈ ప్రాజెక్టులను వేగవంతం చేసి తెలంగాణలో ప్రాంతీయ విమాన సేవలను విస్తరించాలని సీఎం కేంద్రాన్ని కోరారు. రాష్ట్రంలో రహదారులు, విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్ర సహకారం అందించే అంశంపై ఈ భేటీలు కీలకంగా మారాయి.

# హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ నివాసంలో ముగిసిన సోదాలు: ఏసీబీ

హైదరాబాద్, జులై 14: హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు ముగిశాయని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు. ఈ సోదాల్లో అతని వద్ద ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు భారీగా గుర్తించినట్లు తెలిపారు. సోదాల అనంతరం ఆయన మాట్లాడారు. సుమధుర అక్రోపోలిస్‌లో 3ఃఊఖ ఫ్లాట్, శ్రీవారి మెడోస్‌లో మరో ఫ్లాట్ ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వాసవి అట్లాంటిస్‌లో ఏకంగా మూడు ఫ్లాట్లు కొనుగోలు చేసినట్లు కనుగొన్నామని చెప్పారు. మసీద్ బండలో నాలుగు అంతస్తుల భారీ భవనం, జడ్చర్లలో 7 ప్లాట్లు, కొండాపూర్‌లో రెండు ప్లాట్లు ఉన్నాయని వివరించారు.

శంషాబాద్, షాబాద్ పరిధిలో 4 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు.. అందుకు సంబంధించిన ఆధారాలు లభ్యం అయ్యాయని పేర్కొన్నారు. సోదాల్లో అర కిలో బంగారం, వెండి వస్తువులతో పాటు రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ సీజ్ చేశామని అన్నారు. అలాగే బచ్చు రవీందర్ పేరిట ఉన్న 4 బ్యాంక్ లాకర్లను గుర్తించి.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆస్తులతో పాటు ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన 18 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు.

# ఇరాన్‌లోని అణుకేంద్రం మా టార్గెట్స్ లిస్టులో ఉన్నది : డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ, జులై 14: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ పై కఠిన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లోని 'పిక్‌యాక్స్ మౌంటెన్ అణు కేంద్రం అమెరికా లక్ష్యాల జాబితాలోనే ఉన్నదని చెప్పారు. ఆ అణు కేంద్రాన్ని ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నామని వెల్లడించారు. అవసరమైతే త్వరలోనే అక్కడ కూడా దాడి జరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు.

స్పేస్ ఫోర్స్‌తోపాటు ఇతర వ్యవస్థల ద్వారా ఆ కేంద్రంపై నిరంతరం నిఘా కొనసాగుతోందని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అక్కడ ఎలాంటి కదలికలు కనిపించడం లేదని చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన సమాచారం వచ్చినప్పుడల్లా దాన్ని అడ్డుకుంటున్నామని తెలిపారు. ఇరాన్‌తో ఒప్పందం దాదాపు ఖరారయ్యే దశలో ఆ దేశమే వెనక్కి తగ్గిందని ట్రంప్ ఆరోపించారు. ఒప్పందాలను ఉల్లంఘించడం ఇరాన్‌కు అలవాటేనని విమర్శించారు.ఇరాన్ నాయకత్వంపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారి చేతికి అణ్వాయుధం దక్కితే దాన్ని వినియోగించడానికి ఏమాత్రం వెనుకాడరని ఆరోపించారు. అయితే ఆ దేశ నాయకులపై తీసుకునే చర్యల గురించి మాత్రం మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. వైట్‌హౌస్‌లో జరిగిన మరో కార్యక్రమంలో కూడా ట్రంప్ ఇదే అంశంపై స్పందించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇరాన్‌కు అణ్వాయుధం దక్కనివ్వబోమని స్పష్టంచేశారు.

# ఉడాన్ పథకం మరో పదేళ్లు పొడిగిస్తున్నాం: రామ్మోహన్



న్యూఢిల్లీ, జులై 14:ఉడాన్ పథకాన్ని మరో పదేళ్లు పొడిగిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. రూ.30 వేల కోట్లతో 100 కొత్త ఎయిర్‌పోర్టులు, 200 హెలిపోర్టులే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. భారత్‌ను ప్రపంచ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే కేంద్ర లక్ష్యమని ఉద్ఘాటించారు. 2028 జూన్ 2వ తేదీ నాటికి వరంగల్ ఎయిర్‌పోర్ట్‌ను పూర్తి చేయడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈరోజు (మంగళవారం) ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో రామ్మోహన్ మాట్లాడారు.

**బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరును తీర్చిదిద్దుతాం..**

బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా మామునూరును తీర్చిదిద్దుతామని రామ్మోహన్ పేర్కొన్నారు. తన హయాంలోనే మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను వేగవంతం చేయాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పుకొచ్చారు. బౌండరీ వాల్, రన్‌వే టెండర్లు సిద్ధం చేశామని వెల్లడించారు. 3 నుంచి 4 వారాల్లో టెర్మినల్ భవనం టెండర్లు పిలుస్తామని వివరించారు. కాకతీయ కళావైభవాన్ని ప్రతిబింబించే విధంగా టెర్మినల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. దేశంలోనే అత్యుత్తమ ఎయిర్‌పోర్ట్‌గా వరంగల్‌ను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం 253 ఎకరాల భూమిని రికార్డు సమయంలో అప్పగించిందని రామ్మో హన్ తెలిపారు. వరంగల్ ప్రాజెక్టులో ఎలాంటి జాప్యం లేదని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ – సివిలియన్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కసరత్తు చేస్తున్నాయని వెల్లడించారు. ఆదిలాబాద్ ప్రాజెక్ట్‌కు సుమారు 1,500 ఎకరాల భూసే కరణ చేయాలని తెలిపారు. తెలంగాణ ప్రభు త్వం వేగంగా భూమి ఇవ్వడంతో ఆ ప్రాజెక్ట్ పనుల్లో వేగం పెరిగిందనిపేర్కొన్నారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాలను ఒకలా ఎన్డీఏలో లేని రాష్ట్రాలను ఒకలా చూడటం లేదని తేల్చిచెప్పారు. దేశ అభివృద్ధి కోణంలోనే పనులు జరుగుతు న్నాయని వివరించారు. ఆయా ప్రాజెక్టుల పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అవసరమని తెలిపారు. భూసేకరణ రాష్ట్రాల పరిధి లోని అంశమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో భూసేకరణ చేసిందని.. అందుకే అభినందిస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మో హన్ నాయుడు పేర్కొన్నారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్ గడువును పొడిగించండి..

## –ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి

హైదరాబాద్, జులై 14: తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణగడువును పొడిగించాలంటూ ఈసీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈరోజు (మంగళవారం) మంత్రి పొన్నం నేతృత్వంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కాంగ్రెస్ ప్రతినిధుల బృందం కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కాంగ్రెస్ నేతలు వినతి చేశారు. ఓటరు నమోదు ప్రక్రియకు మరింత సమయం ఇవ్వాలన్నారు.

అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఓటరు సవరణ ప్రక్రియ నత్తనడకన నడుస్తోందన్నారు. హైదరాబాద్‌లో కేవలం 21% ఓటరు సవరణే పూర్తయిందని చెప్పారు. ఇంకా 10 రోజుల గడువు మాత్రమే ఉందన్నారు. అది సరిపోదని.. సర్ గడువును పొడిగించాలని కోరారు.

హైదరాబాద్‌లో 4,500 పోలింగ్ స్టేషన్లలో ప్రక్రియ నత్తనడకన ఉందని మంత్రి వెల్లడించారు. బూత్ స్థాయి అధికారులు ఇళ్లకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు సరిగా ఇవ్వడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా పోకూడదని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు పార్టీ క్యాడర్ చురుకుగా పనిచేయాలని సూచించారు. ఓటు లేకపోతే ప్రభుత్వ పథకాలు రావనే ప్రచారం కూడా జరుగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# మూడు లక్షలకు చేరువలో అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య..



న్యూ ఢిల్లీ, జులై 14: పవిత్ర అమర్‌నాథ్ యాత్ర అత్యంత భక్తి శ్రద్ధలతో విజయవంతంగా కొనసాగుతోంది. యాత్ర ప్రారంభమైన తొలి 11 రోజుల్లోనే దర్శించుకున్న భక్తుల సంఖ్య 2.75 లక్షలు దాటి మూడు లక్షలకు చేరువైంది. యాత్రికుల తాకిడి రోజురోజుకు క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ఇవాళ అమర్‌నాథ్‌ను దర్శించుకున్న భక్తుల సంఖ్య మూడు లక్షలు దాటే అవకాశం ఉంది.

మంగళవారం జమ్మూ నుంచి 5,335 మంది భక్తులతో కూడిన మరో బృందం కట్టుదిట్టమైన భద్రత మధ్య అమర్‌నాథ్‌కు బయలుదేరింది. వీరిలో 3,599 మంది పహల్గామ్ బేస్ క్యాంపునకు, 1,736 మంది బల్తాల్ బేస్ క్యాంపునకు వెళ్తున్నారు. సోమవారం ఒక్కరోజే 24,259 మంది యాత్రికులు దర్శనం చేసుకున్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాగా ఈ యాత్రలో సోమవారం ఒక చిన్న రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.రాంబన్ జిల్లాలోని చందర్‌కోట్ సమీ పంలో యాత్రికుల బస్సు బ్రేకులు విఫలం కావడంతో మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో 18 మంది యాత్రికులకు స్వల్ప గాయాల య్యాయి. వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించి, ప్రత్యామ్నాయ వాహనంలో ప్రయాణాన్ని కొనసాగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మినహా యాత్ర ప్రశాంతంగా సాగుతోంది.జూలై 3న ప్రారంభమైన ఈ 57 రోజుల సుదీర్ఘ యాత్ర శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ పర్వదినమైన ఆగస్టు 28న ముగియనుంది. యాత్ర సురక్షి తంగా సాగేందుకు సీఆర్పీఎఫ్, ఆర్మీ, స్థానిక పోలీసులతో సహా భద్రతా బలగాలు సమన్వ యంతో పనిచేస్తూ పటిష్ఠమైన ఏర్పాట్లు చేశాయి.

# జగన్నాథుడి పవిత్ర రథోత్సవంలో పాల్గొని మోక్షం పొందుదాం !

## (16 జూలై 2026 రోజు పూరీ పురవీధుల్లో నిర్వహించే "జగన్నాథ రథయాత్ర" శుభ సందర్భంగా)

జగన్నాథ్ అంటే 'విశ్వ ప్రభువు' అని అర్థం చేసుకుంటున్నాం. జగత్తును పాలించే జగన్నాథుడు కొలువైన పుణ్యక్షేత్రంగా పూరీని దర్శించుకుంటున్నాం. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన వేడుకగా రథోత్సవం అనేక వేల సంవత్సరాలకు ముందే 12వ శతాబ్దంలో మొదలైందనని విశ్వసిస్తారు. బ్రహ్మ, స్కంద, పద్మ పురాణాల్లోనే రథయాత్ర గురించి స్పష్టం చేయబడింది. ఏ ఆలయ గర్భగుడిలోని ప్రతిష్టించిన విగ్రహాలను కదపకుండా ఊరేగింపుల్లో ఉత్సవ విగ్రహాలను మాత్రమే వినియోగిస్తారు. కానీ పూరీ క్షేత్రంలో సాక్షాత్తు గర్భగుడిలో ఉన్న దేవుళ్లను బయటకు తీసి రథయాత్రకు సిద్ధం చేస్తారు. ప్రతి ఏట మూడు కొత్త రథాలను తయారు చేసి రథయాత్రకు వాడతారు. ప్రతి ఏట ఒడిసాలోని పూరీ పుణ్య క్షేత్రంలో ఘనంగా నిర్వహించే "జగన్నాథ రథయాత్ర"కు లక్షలాదిగా భక్తులు హాజరు కావడం, రథాన్ని లాగడం, రథ చక్రాలను స్పర్శించడం, బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడిని కనులారా దర్శించుకోవడం ఓ ప్రత్యేక ఆచారంగా వస్తున్నది. అత్యంత పురాతనమైన, వైభవమైన, ఆధ్యాత్మికమైన రథయాత్రను ప్రపంచవ్యాప్తంగా అనేక దేశ విదేశీ నగరాల్లో కూడా ఘనంగా నిర్వహించడం చూస్తున్నాం. ఈ కాలాతీత సంప్రదాయం కరుణ, సమానత్వం, వినయం, దైవ కృప అందరికీ అందించడాన్ని ఈ యాత్ర సూచిస్తుంది. కుల, మత, వర్గ, జాతీయత అనే అడ్డంకులు లేకుండా అన్ని వర్గాల భక్తులు జగన్ననాథుడి దీవెనలు పొందడానికి సమాన అవకాశాలను కల్పించడం ఈ రథయాత్ర ప్రత్యేకం. రథంపై కొలువైన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలను దర్శించుకోవడం, రథం తాడు లాగడం, భగవంతుడి పవిత్ర నామాలను జపించడం వంటి సత్కార్యాలు ఈ రథయాత్రకు మాత్రమే ప్రత్యేకం.

### 16 జూలై 2026న పురవీధుల్లో జగన్నాథ రథోత్సవం:

జగన్నాథ రథయాత్ర వార్షిక వేడుక పూరీలో ప్రతి ఏట ఆషాడంలో అమావాస్య ద్వితీయ తిథి వేళ (రెండవ రోజున) 16 జూలై 2026న ప్రారంభం అవుతుంది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర మూర్తులను అందంగా అలంకరించిన రథయాత్రను భక్తుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ రథయాత్రలో స్వామివారు 16 జూలై రోజున 3 కిమీ దూరంలో ఉన్న గుండిచా ఆలయానికి చేరి, అక్కడ ఏడు రోజుల పాటు విశ్రాంతి తీసుకొని, బహుదా యాత్ర లేదా తిరుగు ప్రయాణంలో 24 జూలై 2026 రోజున తిరుగు ప్రయాణం నిర్వహించడంతో రథయాత్ర ప్రధాన ఘట్టం పూర్తి అవుతుంది. పూరీలోని రథయాత్రలో శ్రీ జగన్నాథుని రథం గరుడ దివజం (45 అడుగుల ఎత్తుతో 16 చక్రాల నందిఘోష రథం), సోదరుడు బలభద్రుని తాళ ధ్వజం, సోదరి దేవి సుభద్ర రథం దేవదాలన (దర్ప) రథం అనే మూడు రథాలు శ్రీ మందిరం శిఖరంలో దేదీప్యమానంగా కదులుతున్నట్లు కనుపిస్తాయి, కళ్లకు వీనుల విందులను వడ్డిస్తాయి. పూరీలో నిర్వహించే జగన్నాథ రథయాత్ర 16 జూలై 2026ను పురస్కరించుకొని దేశ విదేశీ నగర పురవీధుల్లో కూడా పెద్దఎత్తున బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించడానికి ఇస్కాన్ రాధా గోవింద మందిరాలు, ఆయా నగరాల జగన్నాథ రథయాత్ర కమిటీ సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యాత్రలో వందల మంది కళాకారుల ప్రదర్శనలు, భజనలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు లాంటివి దారి పొడుగునా కొనసాగుతాయి. గమ్యస్థానం చేరిన జగన్నాథుడికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించిన తర్వాత ప్రవచనాలు కొనసాగుతాయి.

### జగన్నాథ రథయాత్ర వెనుక ఆసక్తికర చరిత్ర :

పౌరాణిక కథల ప్రకారం, జేష్ట పూర్ణిమ నాడు జగన్నాథుడి జన్మదిన వేడుకలు జరుగుతాయి. ఈ పవిత్రమైన రోజున జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలకు ఆలయ సమీపంలో 108 కలశాల జలంతో పవిత్ర స్నానం చేయిస్తారు. ఈ స్నానం వల్ల స్వా మివారు అనారోగ్యానికి గురి అవుతారు. ఈ అనారోగ్యం వల్ల స్వామివారిని 15 రోజుల పాటు ఒక ప్రత్యేక గదిలో ఉంచి చికిత్స అందిస్తారు. ఈ సమయంలో ఆలయ ప్రధాన అకర్చకులు, వనమూలికలు అందించే రాజవైద్యులు తప్ప మరెవ్వరూ ఆ గదిలోకి అనుమతించబడరు. 15 రోజుల (అణసర కాలం) పాటు స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వరు. ఆ తర్వాత ఆషాఢ విదియ నాడు "ఛేరా పహరా" అనే ప్రత్యేక ఆచారం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పూరీకి చెందిన గజపతి రాజు బంగారు పోరకతో రథాల మండపాన్ని శుభ్రం చేస్తారు. ఈ క్రతువు ముగిసిన తర్వాత భక్తులు రథాలను లాగడం ప్రారంభించి గుడించా ఆలయానికి తీసుకు వస్తారు. ఇక్కడ ఏడు రోజులు విశ్రాంతి తీసుకొని 9వ రోజు తిరుగు ప్రయాణం చేస్తారు.

పూరీ జగన్నాథ రథయాత్ర కేవలం ఒక అద్భుతమైన ప్రజా ఉత్సవమే కాదు, ఇది సృష్టి కర్తకు, భక్తుడికి గాఢమైన సాన్నిహిత్యాన్ని వీక్షించడానికి ఒక ఆహ్వానంగా తీసుకోవాలి. రథయాత్ర దర్శనంతో సర్వపాపాలు నశించి, మరణానంతరం మోక్షం లభిస్తుందనా సనాతన ధర్మం బోధిస్తున్నది. జగన్నాథ రథోత్సవ రూపంలో జగన్నాథుడు అందరికీ దర్శనమిస్తూ, తన లీలల ద్వారా మానవాళికి దివ్య సందేశం ఇస్తున్నాడు. పుట్టిన వారికి మరణం అనివార్యమని, సుఖదుఃఖాలు సహజమని, అనారోగ్యాలు తప్పవని, చికిత్సలు అవసరమని, మానవ జన్మ గొప్పదని, మంచి పనులు చేయాలని, సత్ప్రవర్తనను కలిగి ఉండాలని, చెండును విసర్జించాలని, మంచి వారితో స్నేహం చేయాలని, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని లోకానికి జగత్తుకే నాథుడు చూటుతున్నారు. స్వామి చూపిన బాటలో మనందరం నడుస్తూ, మన జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

జై జగన్నాథ్ ; జై బలదేవ్ ; జై సుభద్ర.



-మధుపాలీ
9949700037

---

# "భారత్-న్యూజిలాండ్: ఒక విజయవంతమైన భాగస్వామ్యం" ఇతివృత్తంతో న్యూజిలాండ్ ప్రధాని నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 14:''భారత్-న్యూజిలాండ్: ఒక విజయవంతమైన భాగస్వామ్యం" ఇతివృత్తంతో న్యూజిలాండ్ ప్రధానమంత్రి గౌరవ క్రిస్టోఫర్ నిర్వహించిన ప్రత్యేక విందు కార్యక్రమానికి ప్రధానమంత్రి శ్రీ మోదీ హాజరయ్యారు. రాజకీయ, వ్యాపార, పారిశ్రామిక, విద్యా, సాంకేతిక, క్రీడా, కళా రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

న్యూజిలాండ్ ప్రధాని తన స్వాగతోపన్యాసంలో... భారత్-న్యూజిలాండ్ దేశాల మధ్య ఉన్న బలమైన, శాశ్వత సంబంధాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ద్వైపాక్షిక సహకారం బలోపేతం, పరస్పర శ్రేయస్సును పెంపొందించడం పట్ల ఇరు దేశాల ఉమ్మడి దార్శనికతను ఆయన వివరించారు.

ప్రధానమంత్రి శ్రీ మోదీ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య ఉన్న పరస్పర సహకార సమగ్రతను, శాశ్వతమైన ప్రజా సంబంధాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఉన్నతీకరించడాన్ని ఆయన స్వాగతించారు. ఇది కొనసాగుతున్న సహకారాన్ని మరింతగా పెంపొందిస్తుందని శ్రీ మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. రికార్డు సమయంలో కుదిరిన భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఇరు దేశాల్లోని వ్యాపారాలకు, యువతకు, రైతులకు కొత్త అవకాశాలను కల్పిస్తుందన్నారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని సాధించడంలోనూ ఇది సహాయపడుతుందని శ్రీ మోదీ పేర్కొన్నారు.

గాలా లంచ్ అనంతరం, ఆ ప్రాంగణంలో ప్రదర్శనకు ఉంచిన వినూత్న క్రీడా పరికరాలను ఇరు దేశాల ప్రధానమంత్రులు పరిశీలించారు. న్యూజిలాండ్‌కు చెందిన ప్రఖ్యాత క్రీడాకారులు, క్రీడలకు సంబంధించిన అత్యున్నత స్థాయి భాగస్వాములతో వారు సమావేశమయ్యారు. ఇరుపక్షాల మధ్య వందేళ్ల క్రీడా సంబంధాలను గుర్తుచేసుకుంటూ... ఈ పర్యటన సందర్భంగా కుదిరిన క్రీడల ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, క్రికెట్‌కు అతీతంగా ఇరు దేశాలు తమ సంబంధాలను విస్తరించుకోవడానికి సహాయపడుతుందని ప్రధానమంత్రి శ్రీ మోదీ పేర్కొన్నారు. 2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యమివ్వడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో, క్రీడా సహకారాన్ని విస్తరించాలన్న ఇరుపక్షాల ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ పర్యటన సాగింది.

# కొమరం భీం విగ్రహానికి రూ.లక్ష విరాళం..



ఆదిలాబాద్, జులై 14: అదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గంలోని సిరికొండ మండల ఆదివాసీ నాయకులు మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సిరికొండ మండల కేంద్రంలో కొమరం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి స్పందించిన బొజ్జు పటేల్ తన వంతు సహాయంగా రూ.1 లక్ష విరాళాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గిరిజన, ఆదివాసీ పోరాట యోధుల స్ఫూర్తిని భావితరాలకు చాటిచెప్పే కార్యక్రమాలకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం: ఎస్సై సాయి కిరణ్

ఆదిలాబాద్, జులై 14: కడెం మండలంలోని కొండుకూర్ గ్రామంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా మంగళవారం ఘనంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడెం పోలీస్ స్టేషన్ ఎస్సై సాయి కిరణ్, నిర్మల్ జిల్లా ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు పొదుటూరి సంపత్‌రెడ్డి హాజరై మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మొక్క అంటే కేవలం చెట్టు కాదు.. భావితరాలకు ఇచ్చే జీవదానం అని అన్నారు. ఒక్క చెట్టు సంవత్సరానికి సుమారు 20 కిలోల కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చుకుని స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందిస్తుందని తెలిపారు.

వేసవి ఉష్ణోగ్రతలను తగ్గించడంతో పాటు వర్షాలు కురిసేందుకు, మట్టి కోతను నివారించేందుకు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు చెట్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. పక్షులు, ఇతర జీవరాశులకు ఆశ్రయం కల్పించి పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో వృక్షాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ, జీపీవో విజయ్, అంగన్‌వాడీ టీచర్ గంగమణి, నాయకులు ముక్కర గంగాధర్, అంజన్న, గ్రామ పంచాయతీ సిబ్బంది, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వే వేగవంతం చేయాలి: చైర్మన్

ఆదిలాబాద్, జులై 14:ఎస్ ఐ ఆర్ సర్వే ను వేగవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడివేత విశ్వనాథరావు తాహసిల్దార్ ఆడ బీర్షావ్ కోరారు. కొమురం భీమా శివబా జిల్లా జైనూర్ మండల కేంద్రంలో మేజర్ గ్రామపంచాయతీ ఓటర్ల కోసం మార్కెట్ కమిటీ యాడ్ లో ప్రత్యేక ఎస్ఐఆర్ సర్వే క్యాంపు నిర్వహించారు.

ఈ క్యాంపులో జైనర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెట్ విశ్వనాథ్ రావు , జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్ పాల్గొని ప్రత్యేక సర్వే క్యాంపును పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ఓటర్లు త్వరగా పూర్తి వివరాలతో ఎస్ఐఆర్ సర్వే ఫారాలను నింపి బిఎల్ఓ లకు అందించాలని , నింపిన సర్వే ఫారాలను ఆన్లైన్ చేయించాలని కోరారు.

ఎన్ ఐ ఆర్ సర్వే ప్రాముఖ్యత గురించి క్యాంపులో పాల్గొన్న ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జై నూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కోడప ప్రకాష్, ఆర్ఐ మోహన్, జై నూర్ మేజర్ గ్రామపంచాయతీ ఇన్చార్జీ ఈవో ఆనందరావు, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షులు మడవి భీమ్రావు, ఎంపిటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షులు కుమ్ర భగవంతరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంతియాజ్ లాల,కాంగ్రెస్, బి ఆర్ ఎస్ యువ నాయకులు మెస్రం అంబాజీరావు, ముండే సతీష్, వార్డ్ సభ్యులు పూర్క బాపూరావు, వివిధ పార్టీల నాయకులు ఆదివాసి సంఘ నాయకులు ,పంచాయతీ కార్యదర్శులు, బిఎల్వోలు, ప్రజలు పాల్గొన్నారు.

# సంప్రదాయ రక్షణ సామర్థ్యాలను పటిష్ఠం చేస్తూనే.. తదుపరి తరం సరికొత్త సాంకేతికతపై పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది: రక్షణ మంత్రి




న్యూ ఢిల్లీ, జులై 14:ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 2026 జూలై 11న రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఒక ప్రత్యేక వేడుకలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి'ని భారత నౌకాదళం తన తూర్పు నావికాదళ శ్రేణిలోకి అధికారికంగా చేర్చుకుంది. ఈ సందర్భంగా రక్షణ మంత్రి మాట్లాడుతూ.. ఈ ఫ్రంట్‌లైన్ యుద్ధనౌక నౌకా నిర్మాణ రంగంలో భారత్ సాధిస్తున్న స్వయంసమృద్ధికి నిదర్శనమని కొనియాడారు. అసాధారణమైన రూపకల్పన సామర్థ్యాలు, అద్భుతమైన ఉత్పాదకత, నావికా-పారిశ్రామిక వ్యవస్థ వేగవంతమైన వృద్ధి, అత్యాధునిక రక్షణ వేదికలను నిర్ణీత గడువులోగా అందించగల దేశ ప్రతిభకు ఇది అద్దం పడుతోందని ఆయన స్పష్టం చేశారు.

కేవలం ఒకటిన్నర సంవత్సరాల స్వల్ప వ్యవధిలోనే భారత నౌకాదళంలో చేరిన ఆరో ప్రాజెక్టు 17ఏ స్వదేశీ యుద్ధ నౌకగా 'ఐఎన్ఎస్ మహేంద్రగిరి' రికార్డు సృష్టించింది. ఈ శ్రేణిలో మొదటి యుద్ధనౌక 'ఐఎన్ఎస్ నీలగిరి' 2025 జనవరిలో రక్షణ విధుల్లోకి చేరగా.. ఆ తర్వాత వరుసగా 'ఐఎన్ఎస్ ఉదయగిరి', 'ఐఎన్ఎస్ హిమగిరి' నౌకలు అదే ఏడాది ఆగస్టులో చేరాయి. ఈ సంవత్సరం (2026) ఏప్రిల్ లో 'ఐఎన్ఎస్ తారగిరి', గత నెలలో 'ఐఎన్ఎస్ దునగిరి' నౌకాదళంలో భాగమయ్యాయి. భారత నౌకాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన ఈ సరికొత్త యుద్ధనౌకను ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్) నిర్మించింది. సంపూర్ణ నావికాదళ కార్యకలాపాలను నిర్వహించగల అద్భుత సామర్థ్యం దీని సొంతం. నౌకాదళ వైమానిక రక్షణ, ఉపరితల రక్షణ పోరాటాలు), జలాంతర్గామి నిరోధక చర్యలు, సముద్రయాన నిషేధాజ్ఞల అమలు , నిరంతర నిఘా వంటి కీలక బాధ్యతలను ఇది సమర్థవంతంగా నిర్వహించగలదు. వీటితో పాటు మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యల్లోనూ ఈ నౌక కీలకపాత్ర పోషించనుంది.

75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ యుద్ధనౌక సుమారు 6,670 టన్నుల బరువును మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉండి.. గరిష్టంగా 28 నాట్ల వేగంతో ప్రయాణించగలదు. ఇది శబ్దవేగాన్ని మించిన సూపర్‌సోనిక్ ఉపరితల-ఉపరితల క్షిపణులు, మధ్యస్థ శ్రేణి ఉపరితల-గగనతల క్షిపణులు, జలాంతర్గామి నిరోధక పోరాట వ్యవస్థలతో పాటు బహుళ ప్రయోజన హెలికాప్టర్‌ను మోసుకెళ్లే వసతిని కలిగి ఉంది. అత్యాధునిక స్టెల్త్ ఫీచర్లు, ఆధునిక సెన్సార్లు, వ్యవస్థ-కేంద్రిత పోరాట వ్యవస్థలు, అత్యుత్తమ ఆయుధ సంపత్తి దీని సొంతం.

"ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన, అత్యంత శక్తిమంతమైన క్రూయిజ్ క్షిపణులలో ఒకటైన బ్రహ్మోస్.. ఉపరితల-ఉపరితల క్షిపణిని ఐఎన్ఎస్ మహేంద్రగిరిలో అమర్చవచ్చని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. సుదూర ప్రాంతాలలోని వైమానిక ముప్పులను గుర్తించి, వాటిని ముందే అడ్డుకునేందుకు వీలుగా బహుళ ప్రయోజన రాడార్, ఉపరితల-గగనతల క్షిపణుల ఉమ్మడి వ్యవస్థ ఇందులో ఉందని చెప్పారు. దీని ఆయుధాగారంలో స్వదేశీ రాకెట్ లాంచర్, టార్పెడో లాంచర్లు, సమీకృత జలాంతర్గామి నిరోధక రక్షణ వ్యవస్థ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్, క్లోజ్-ఇన్ వెపన్ సిస్టమ్ వంటి రక్షణ వలయాలు ఉన్నాయి. ఈ అద్భుత సామర్థ్యాలన్నీ ఈ యుద్ధనౌకను అత్యంత శక్తిమంతమైనదిగా, తిరుగులేనిదిగా మార్చాయని రక్షణ మంత్రి కొనియాడారు. ఈ 'బ్లూ-వాటర్ షిప్' కేవలం తీరప్రాంతాల్లోనే కాకుండా.. సుదూరంగా ఉండే లోతైన మహాసముద్రాలలో సైతం భారతదేశ సముద్ర ప్రయోజనాలను సంపూర్ణంగా కాపాడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

డ్రోన్లు, కృత్రిమ మేధ, సైబర్ వార్‌ఫేర్, అంతరిక్ష ఆధారిత సామర్థ్యాలు, హైపర్‌సోనిక్ ఆయుధాలు, మానవరహిత వ్యవస్థల వంటి సరికొత్త సాంకేతికతలు యుద్ధ స్వరూపాన్ని గణనీయంగా మార్చివేసినప్పటికీ,సమర్థవంతమైన రక్షణకు సంప్రదాయ సైనిక సామర్థ్యాలే ఇప్పటికీ మూలస్తంభాలని రక్షణ మంత్రి చెప్పారు. "భవిష్యత్తు యుద్ధాలు బహుశా కృత్రిమ మేధతో జరగవచ్చు. కానీ విజయం మాత్రం జాతీయ సంకల్పం, శిక్షణ పొందిన సైనికులు, విశ్వసనీయమైన సైనిక శక్తి ద్వారానే సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికతలు, సంప్రదాయ వేదికలు ఒకదానికొకటి పోటీదారులు కావని, పరస్పర పూరకాలుగా పనిచేస్తాయని వివరించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తదుపరి తరం సాంకేతికతలపై పెట్టుబడులు పెడుతూనే, సంప్రదాయ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే సమతుల్య విధానానికి కట్టుబడి ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. జాతీయ భద్రతను కాపాడటంలో సంప్రదాయ, ఆధునిక సామర్థ్యాల సమర్థవంతమైన ఏకీకరణకు ఆపరేషన్ సింధూర్ ఒక అద్భుతమైన ఉదాహరణ అని గుర్తుచేశారు. సాంకేతికంగా అత్యంత పురోగతి సాధించిన, పోరాటానికి సిద్ధంగా ఉన్న నౌకాదళ నిర్మాణానికి ఐఎన్ఎస్ మహేంద్రగిరి దేశ సంకల్ప ప్రతీక అని పేర్కొన్నారు.

సముద్ర భద్రత, ఆర్థిక భద్రత అనేవి ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని రక్షణ మంత్రి వెల్లడించారు. జాతీయ భద్రతకే కాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, సరఫరా వ్యవస్థలు, ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధికి సముద్ర మార్గాలు ఎంతో కీలకమని చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతం యొక్క వ్యూహాత్మక ప్రాధాన్యతను వివరిస్తూ.. ఈ ప్రాంతంలోని అందరి భద్రత, వృద్ధిని కాంక్షించే 'సాగర్' దార్శనికతకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

"భారత్ ఒక నికర భద్రతా ప్రదాత. ప్రాంతీయ భద్రత, అభివృద్ధిని నిర్ధారించడానికి కట్టుబడిన ఒక నమ్మకమైన భాగస్వామి" అని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యలు (హెచ్‌ఏడీఆర్), సముద్రపు దొంగల నిరోధక మిషన్లు, సంక్షోభ ప్రాంతాల నుంచి భారతీయ, విదేశీ పౌరులను సురక్షితంగా తరలించడంలో నావికాదళం ఈ నిబద్ధతను నిరంతరం నిరూపిస్తోందని ప్రశంసించారు. సమయానుకూలమైన, సమర్థవంతమైన కార్యాచరణ ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత నౌకాదళం 'తొలి స్పందనదారు', 'అత్యంత ఆదరణ కలిగిన భద్రతా భాగస్వామి'గా గుర్తింపు పొందిందని ఆయన పేర్కొన్నారు.

పశ్చిమాసియా సంక్షోభ సమయంలో భారత నౌకాదళం పోషించిన పాత్రను రక్షణ మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆపరేషన్ ఊర్జా సురక్ష కింద సుమారు రూ. 9,000 కోట్లకు పైగా విలువైన అత్యవసర సరుకుతో వెళ్తున్న 18 వాణిజ్య నౌకలకు నావికాదళం సురక్షిత రక్షణ కల్పించిందని వెల్లడించారు. ఈ ప్రయత్నాలు నౌకాదళాన్ని కేవలం ఒక పోరాట శక్తిగానే కాకుండా.. దేశ ఆర్థిక ప్రయోజనాల రక్షకురాలిగా నిలబెట్టాయని చెప్పారు. ఐఎన్ఎస్ మహేంద్రగిరి చేరికతో దేశ సముద్ర రక్షణ వ్యూహం మరింత బలోపేతం అవుతుందని, ఇది తూర్పు తీర రక్షణ సామర్థ్యాన్ని పెంచుతూ, సుదూర తీర సముద్ర (బ్లూ-వాటర్) పరిధిని విస్తరిస్తూ, హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారతదేశ ఉనికిని మరింత సుస్థిరం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

స్వదేశీ యుద్ధనౌకల నిర్మాణం కేవలం పోరాట వేదికలను రూపొందించడానికే పరిమితం కాలేదని, దేశీయ రూపకల్పన సామర్థ్యాలు, సాంకేతిక నైపుణ్యం, నిపుణులైన మానవ వనరులు, సముద్రయాన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేస్తోందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. నౌకా నిర్మాణం అనేది ఉక్కు, ఎలక్ట్రానిక్స్, సెన్సార్లు, ప్రొపల్షన్ వ్యవస్థలు, సాఫ్ట్‌వేర్, ప్రెసిషన్ ఇంజనీరింగ్, లాజిస్టిక్స్ వంటి బహుళ రంగాలలో వృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు.

# 22(ఏ) భూముల నుంచి విముక్తి..

**-ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



విజయవాడ, జులై 14: నిషేధిత భూముల (22-ఏ) జాబితాలో పొరపాటున నమోదైన భూములకు సంబంధించి పట్టాదారులకు సత్వర న్యాయం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును పారదర్శకంగా, చట్టబద్ధంగా, వేగవంతంగా పరిశీలిస్తూ 22(ఏ) కేసుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రత్యేక దృష్టిసారించిందన్నారు.

అర్హులైన ఏ ఒక్క భూ యజమాని కూడా అనవసరంగా ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణలు నిర్వహించి, చట్టబద్ధంగా అర్హత ఉన్న భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ యాజమాన్య హక్కులను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 22(ఏ) కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే 72 కేసులను పరిష్కరించి 282 ఎకరాల భూమికి 22(ఏ) జాబితా నుంచి విముక్తి కల్పించడం జరిగిందన్నారు. 2024లో నాలుగు కేసులకు సంబంధించి 8.95 ఎకరాలు, 2025లో 19 కేసులకు సంబంధించి 105.55 ఎకరాలు, 2026లో ఇప్పటివరకు 49 కేసులకు సంబంధించి 167.91 ఎకరాలకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు.

అర్జీలను పరిష్కరించి రిజిస్ట్రేషన్‌కు వీలుకల్పించిన దరఖాస్తుల్లో అయిదు నుంచి 15 ఏళ్లపాటు సైతం అపరిష్కృతంగా ఉన్నవి కూడా ఉన్నాయన్నారు. ఇలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక కేసులు ప్రస్తుతం పరిష్కారమవుతుండటంతో భూ యజమానులకు ఎంతో ఊరట లభిస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా సంబంధిత రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ తాతయ్య ఆస్తి పంపకాల సమయంలో 2018 నుంచి భూమి 22(ఏ) జాబితాలో ఉన్నట్లు తెలిసిందని, ఎన్నిసార్లు దరఖాస్తులు చేసినా పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో సమస్య పరిష్కారమై, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ధృవీకరణ పత్రం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రెడ్డిగూడెం మండలానికి చెందిన మరో లబ్ధిదారుడు మాట్లాడుతూ 2016 నుంచి తమ భూమి 22(ఏ) జాబితాలో ఉండేదని, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వారు ప్రత్యేకంగా స్పందించి నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో తమ కుటుంబానికి ఎంతో ఉపశమనం కలిగిందన్నారు.

విస్సన్నపేట మండలం కొరపాటి రాంబాబు మాట్లాడుతూ 2018లో భూమి విక్రయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లినప్పుడు 2016 నుంచే తమ భూమి 22(ఏ) జాబితాలో ఉన్నట్లు తెలిసిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాలు ఇప్పుడు ఫలించి సమస్య పరిష్కారమవడం సంతోషంగా ఉందని తెలిపారు.

విజయవాడ రూరల్ మండలానికి చెందిన వెంకటరెడ్డి మాట్లాడుతూ, తనకు చెందిన ఒక ఎకరం 45 సెంట్ల భూమి 2018 నుంచి నిషేధిత జాబితాలో ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని కేసును పరిశీలించి న్యాయం చేయడంతో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ధృవీకరణ పత్రం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు.

విస్సన్నపేటకు చెందిన హసీనా మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వే నంబర్ 239/5లోని వరి పొలం 2016లో 22(ఏ) జాబితాలో చేర్చారని, అది 2023లో తమకు తెలిసిందన్నారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు చేయగా అధికారులు స్పందించి భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారని, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బండిపాలెం పంచాయతీకి చెందిన గుమ్మ జాలయ్య మాట్లాడుతూ తమ భూమికి సంబంధించిన 92-బి సబ్-డివిజన్ సమస్య చాలా కాలంగా పెండింగ్‌లో ఉండేదని, ప్రస్తుతం అధికారులు సమగ్రంగా పరిశీలించి సమస్యను పూర్తిగా పరిష్కరించి తమ హక్కులను పునరుద్ధరించారని హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు.. రాష్ట్ర ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా 22(ఏ) కేసులను ప్రత్యేక కార్యాచరణతో వేగంగా పరిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, రెవెన్యూ యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అర్హులైన భూ యజమానులకు న్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, మిగిలిన అర్హులైన దరఖాస్తుదారుల సమస్యలు కూడా ఇదే వేగంతో పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సెప్టెంబర్లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..

**-డీఎంఎఫ్ఎ, సీఎస్ఆర్ పనుల్లో వేగం పెంచాలి**

**-పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

కరీంనగర్, జులై 14: జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో డీఎంఎఫ్, సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ప్రాజెక్టర్ ద్వారా పనుల పురోగతిని పరిశీలించి,సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ నిధులతో మంజూరైన గ్రామీణ అభివృద్ధి పనులన్నింటినీ ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడైనా క్రిటికల్ గ్యాప్స్ ఉన్నట్లయితే వెంటనే గుర్తించి సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ భవనాల మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, చిన్నారులకు సురక్షితమైన, మెరుగైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత కింద భారత ఏఐ, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ వృద్ధిలో హైదరాబాద్ పాత్ర కీలకం: కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్




న్యూఢిల్లీ, జులై 14:భారత్ సొంతమైన విశ్వసనీయ ప్రపంచ ఖ్యాతిని, నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను సద్వినియోగం చేసుకుంటూ... భారత ఐటీ పరిశ్రమ సాఫ్ట్‌వేర్ సేవల ఆధారిత నమూనా నుంచి "ఏఐ యాజ్ ఏ సర్వీస్" నమూనాకు మారాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వేలు, సమాచార, ప్రసార శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ పిలుపునిచ్చారు.

హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హెచ్‌వైఎస్ఈఏ) ఆధ్వర్యంలో "వికసిత్ భారత్-2047 నిర్మాణంలో సాంకేతికత పాత్ర'' అంశంపై హైదరాబాద్ ఇండస్ట్రీ లీడర్ టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ వైష్ణవ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమం అనంతరం పరిశ్రమ ప్రముఖులతో రౌండ్‌టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ వైష్ణవ్‌తో పాటు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల ప్రముఖులనుద్దేశించి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వికసిత్ భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో తయారీ, అధునాతన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా భారత తదుపరి దశ వృద్ధి సాధ్యమవుతోందన్నారు.

ఐటీ పరిశ్రమను కృత్రిమ మేధ మౌలికంగా మార్చేసిందని పేర్కొంటూ... ప్రతీ కొత్త ఏఐ నమూనా కొత్త సామర్థ్యాలను, అవకాశాలను తీసుకు వస్తుందన్నారు. పరిశ్రమలను అర్థం చేసుకోవడం, సమస్యలను గుర్తించడం, సమర్థమైన సాంకేతికత ఆధారిత పరిష్కారాలను అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సంపాదించిన విశ్వాసమే భారత్ అతిపెద్ద బలమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

వ్యూహాత్మక మార్పు ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావిస్తూ... భారత ఐటీ పరిశ్రమ ఇప్పుడు సాఫ్ట్‌వేర్-యాజ్-ఎ-సర్వీస్ నమూనాను దాటి, ఏఐని ఒక సేవగా అందించే (ఏఐ యాజ్ ఎ సర్వీస్) నమూనా దిశగా పరిణామం చెందాలని శ్రీ వైష్ణవ్ సూచించారు. పరిశ్రమల, విద్యాసంస్థల మధ్య సన్నిహిత సహకారంతో ఈ పరివర్తనను ముందుకు నడిపించాలని ఆయన కోరారు. ఇటీవలి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ... కృత్రిమ మేధలోని తాజా పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, ప్రభుత్వ భాగస్వామ్యంతో నాస్కామ్ ఒక సమగ్ర ఏఐ పాఠ్య ప్రణాళికను అభివృద్ధి చేసిందని తెలిపారు. దానిని విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈతో పంచుకున్నామని శ్రీ వైష్ణవ్ వివరించారు.

సెమీకండక్టర్ల తయారీ రంగంలో దేశం సాధించిన పురోగతిని వివరిస్తూ, 1960ల నుంచే భారత్ ఒక సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించాలని ఆకాంక్షించిందన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ప్రత్యేక కృషి వల్ల ఆ దార్శనికత ఇప్పుడు వాస్తవరూపం దాల్చిందని శ్రీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం 12 సెమీకండక్టర్ తయారీ ప్లాంట్లు వివిధ అభివృద్ధి దశల్లో ఉన్నాయని తెలిపారు. వాటిలో మూడు ప్లాంట్లు ఇప్పటికే జపాన్, యూరప్, దేశీయ మార్కెట్లకు ఎగుమతి అవుతున్న చిప్‌లను ఉత్పత్తి చేస్తున్నాయని ఆయన వివరించారు.

దేశంలో అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్ డిజైన్ వ్యవస్థ, దానికి తోడు ప్రపంచ వ్యాప్తంగా నిపుణుల కొరత ఉండటం ఐటీ పరిశ్రమకు ముఖ్యమైన అవకాశాన్ని కల్పిస్తోందని కేంద్ర మంత్రి అన్నారు. వినూత్నమైన సెమీకండక్టర్ పరిష్కారాలను రూపొందించడం కోసం ఎలక్ట్రానిక్స్, ఐటీ, డిజైన్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ రంగాల్లో తమకున్న బలాన్ని, అనుభవాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కంపెనీలను ప్రోత్సహించారు. ప్రతిభావంతుల లభ్యతను బలోపేతం చేయడానికి ప్రభుత్వం 315 విశ్వవిద్యాలయాలకు అధునాతన సెమీకండక్టర్ డిజైన్ సాధనాలను అందుబాటులోకి తెచ్చిందని శ్రీ వైష్ణవ్ తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై శ్రీ వైష్ణవ్ మాట్లాడుతూ... ఈ రంగంలో భారత్ అపూర్వ వృద్ధిని సాధిస్తోందన్నారు. గత సంవత్సరం మొబైల్ ఫోన్లు దేశంలోనే అతిపెద్ద ఎగుమతి విభాగంగా ఆవిర్భవించాయని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం విలువ ప్రస్తుత రూ. 13 లక్షల కోట్ల నుంచి సమీప భవిష్యత్తులోనే రూ. 20 లక్షల కోట్లకు విస్తరిస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. ఒక్క తెలంగాణలోనే, కేంద్ర ప్రభుత్వం 104 ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీల ఏర్పాటుకు మద్దతునిచ్చిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. నాలుగు ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లనూ మంజూరు చేసిందని, ఒక కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేసిందని ఆయన వివరించారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి దార్శనికత కింద హైదరాబాద్ ఒక ప్రధాన కేంద్రంగా ఆవిర్భవించడానికి సిద్ధంగా ఉందని శ్రీ వైష్ణవ్ అన్నారు. నగరంలో మూడు బుల్లెట్ రైలు కారిడార్ల ఏర్పాటుకూ ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు. ఇవి హైదరాబాద్‌ను హై-స్పీడ్ రైలు అభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి ఒక ముఖ్య కేంద్రంగా నిలబెడతాయని ఆయన తెలిపారు.

తెలంగాణలో రైల్వే పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని కేంద్ర మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. యూపీఏ హయాంలో అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రైల్వే అభివృద్ధి కోసం ఏటా సుమారు రూ.880 కోట్లు పొందేదన్నారు. ప్రస్తుతం ఒక్క తెలంగాణ రాష్ట్రానికే రూ.5,400 కోట్లకు పైగా నిధులు అందుతున్నాయని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా 1,300కు పైగా స్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా... అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలోని సుమారు 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సాంకేతికత ఆధారిత వృద్ధి, ఆవిష్కరణలకు దేశంలోనే అత్యంత ముఖ్యమైన కేంద్రాల్లో ఒకటిగా హైదరాబాద్ ఆవిర్భవించిందని కేంద్ర మంత్రి అన్నారు. సెమీకండక్టర్లు, ఏఐ, కవచ్ టెక్నాలజీ, వీఎఫ్ఎక్స్, డిజిటల్ ఆవిష్కరణల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఈ నగరం గణనీయ తోడ్పాటునందిస్తోందని పేర్కొన్నారు. కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల తయారీ, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణల రంగాలకు సంబంధించి భారత్ భవిత నిర్మాణంలో ఈ నగరం కీలక పాత్ర పోషిస్తుందని శ్రీ వైష్ణవ్ వివరించారు.

'గత దశాబ్ద కాలంలో భారత్ ఒక బలమైన డిజిటల్ పునాదిని నిర్మించుకుంది. ఇది డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల్లో దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టింది. యూపీఐ ద్వారా రూ. 314 లక్షల కోట్లకు పైగా విలువైన లావాదేవీలు జరిగాయి. స్వదేశీ 4జీ, 5జీ సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయి. సరసమైన ధరలకే డేటా సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ స్థాయి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు అన్ని రంగాల్లో ఆవిష్కరణలను, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తున్నాయ'ని కేంద్ర మంత్రి వివరించారు.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఈ అభివృద్ధి హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకూడదన్నారు. వరంగల్, కరీంనగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధికి కేంద్రాలుగా ఆవిర్భవించాలని... తెలంగాణ వ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ వృద్ధి జరగాలని పేర్కొన్నారు. సికింద్రాబాద్, నాంపల్లి రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి, కొత్త రైల్వే మౌలిక సదుపాయాలు, 100 శాతం రైల్వే విద్యుదీకరణ వంటి పనులు కనెక్టివిటీని విస్తరిస్తూనే, హైదరాబాద్ వృద్ధినీ బలోపేతం చేస్తాయని శ్రీ కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

కేంద్ర మంత్రులు శ్రీ అశ్వినీ వైష్ణవ్, శ్రీ జి. కిషన్ రెడ్డి కొండకల్‌లోని మేధా బోగీస్ ఫ్యాక్టరీని, ఫ్యాబ్ సిటీ రోడ్డులోని మేధా సెర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌నూ సందర్శించారు. అక్కడ తయారీ కార్యకలాపాలను వారు సమీక్షించారు. సాంకేతిక సామర్థ్యాలు, భద్రతా సన్నద్ధత సంబంధిత వివరాలను గురించి అధికారులు, ఉద్యోగులతో సంభాషించారు. ప్రారంభ దశకు ముందు కీలక సౌకర్యాలనూ కేంద్ర మంత్రులు తనిఖీ చేశారు.

# హైదరాబాద్‌లో ఆధునీకరించిన రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించనున్న ఎన్‌సీఎస్‌సీ చైర్మన్ శ్రీ కిషోర్ మక్వానా

న్యూ ఢిల్లీ, జులై 14:షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) చైర్మన్ శ్రీ కిషోర్ మక్వానా 2026 జులై 13న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. కవాడిగూడలోని సీజీఓ టవర్స్ సముదాయంలో నూతనంగా ఆధునీకరించిన ఎన్‌సీఎస్‌సీ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో చైర్మన్ వెంట ఎన్‌సీఎస్‌సీ సభ్యులు శ్రీ వడ్డెపల్లి రాంచందర్, కమిషన్ కార్యదర్శి శ్రీ గుడే శ్రీనివాస్ (ఐఏఎస్) పాల్గొననున్నారు.

కార్యాలయ ప్రారంభోత్సవ వేడుక అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో చైర్మన్ ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ షెడ్యూల్డ్ కులాల సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. పర్యటనలో భాగంగా చైర్మన్ ప్రజలను స్వయంగా కలిసి షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతులను స్వీకరిస్తూ వారితో ముఖాముఖి మాట్లాడుతారు.

అధికారిక పర్యటనలో భాగంగా ఎన్‌సీఎస్‌సీ చైర్మన్ శ్రీ కిషోర్ మక్వానా నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించనుంది. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వాటిని మరింత మెరుగుపరచడంపై ఈ చర్చలు ప్రధానంగా సాగనున్నాయి.

# అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను భ్రమరాంబిక అమ్మవారికి సమర్పణ



అమరావతి, జులై 14: అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి అమ్మవారికి అగ్గిపెట్టెలో ఇమిడిపోయే అరుదైన చేనేత పట్టుచీరను మంగళవారం సమర్పించారు. ఈ ప్రత్యేక పట్టుచీరను తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు, కళారత్న నల్ల విజయ్ కుమార్ దేవస్థానానికి అందజేశారు.

దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు ఈ ప్రత్యేక పట్టుచీరను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యురాలు కోడె కాంతివర్ధిని కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, తన కుటుంబ సభ్యులతో కలిసి వారం రోజుల పాటు మగ్గంపై శ్రమించి ఈ ప్రత్యేక పట్టుచీరను రూపొందించినట్లు తెలిపారు. చీర పొడవు 5.5 మీటర్లు, వెడల్పు 48 అంగుళాలు కాగా, బరువు సుమారు 200 గ్రాములు మాత్రమే ఉంటుందన్నారు. సంప్రదాయ ఇక్కత్ నమూనాలో రూపొందించిన ఈ పట్టుచీరను ప్రత్యేక పద్ధతిలో మడతపెడితే చిన్న అగ్గిపెట్టెలో సైతం సులభంగా ఇమిడిపోతుందని వివరించారు. శ్రీ భ్రమరాంబిక అమ్మవారి అనుగ్రహంతోనే ఈ అరుదైన కళాఖండాన్ని రూపొందించగలిగినట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు విజయ్ కుమార్ ప్రతిభను అభినందించారు. చేనేత కళాకారుల అపూర్వ నైపుణ్యానికి ఈ పట్టుచీర నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. భారతీయ సంస్కృతిలో చేనేతకు ప్రత్యేక స్థానం ఉందని, అది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా తరతరాలుగా వస్తున్న గొప్ప కళ అని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలు కళాకారుల సృజనాత్మకత, నైపుణ్యం, అంకితభావానికి ప్రతీకలని చెప్పారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

వస్త్ర సమర్పణ చేసిన విజయ్ కుమార్, ఆయన బృందానికి దేవస్థానం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసింది. కార్యక్రమంలో పలువురు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతుల్ని తీర్చిదిద్దుతున్న హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్

న్యూ ఢిల్లీ, జులై 14:కొలంబియా.. బుకారామాంగాలో నిర్వహించిన 56వ అంతర్జాతీయ భౌతికశాస్త్ర ఒలింపియాడ్-2026 (ఐపీహెచ్ఓ)లో పాల్గొన్న భారతీయ బృందం అసాధారణ ప్రదర్శనను కనబరిచింది. బృందంలోని అయిదుగురు సభ్యులూ బంగారు పతకాలను గెలిచి దేశం గర్వపడేట్టు చేశారు.

87 దేశాలకు చెందిన 381 మంది విద్యార్థుల్లో- చైనా, కజకిస్తాన్, రష్యా, దక్షిణ కొరియా, తైవాన్‌లతో కలిసి భారత్.. ప్రపంచంలో అగ్ర స్థానాన్ని చేజిక్కించుకుంది. అంతర్జాతీయ స్థాయిలో విజ్ఞానశాస్త్ర విద్యలోనూ, శ్రేష్ఠత్వంలోనూ భారత్ స్థాయి అంతకంతకూ పెరుగుతోంది. భారత్ పక్షాన పతకాలను గెలిచిన వారిలో మహారాష్ట్ర.. పుణేకు చెందిన శ్రీ కనిష్క్ జైన్, మధ్యప్రదేశ్.. ఇండోర్‌కు చెందిన శ్రీ రిద్ధేశ్ అనంత్ బెండాలే, న్యూఢిల్లీ.. ద్వారకకు చెందిన శ్రీ రుషిత్ గర్గ్, మహారాష్ట్ర.. ముంబయికి చెందిన శ్రేష్ఠ్ సురైయా, గుజరాత్.. అహ్మదాబాద్‌కు చెందిన స్వరిత్ జోషీ ఉన్నారు.

ఈ అసాధారణ విజయం అంతర్జాతీయ భౌతికశాస్త్ర ఒలింపియాడ్‌లో భారత్ గౌరవశాలి వారసత్వాన్ని నిలబెట్టింది. గత పది సంవత్సరాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భారతీయుడూ విజేతగా నిలిచారు.

ఈ విజయం భారత్ ఒలింపియాడ్ కార్యక్రమానికున్న శక్తిని చాటుతోంది. హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ (హెచ్‌బీసీఎస్ఈ) దీనికి సారథ్యం వహిస్తోంది. ఈ సంస్థ టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసర్చ్ (టీఐఎఫ్ఆర్)కు సంబంధించిన జాతీయ కేంద్రంగా కూడా ఉంది. ఇది అణు ఇంధన విభాగం (డీఏఈ) నుంచి సహాయాన్ని అందుకుంటున్న సంస్థ కూడా. భారత్‌లో ఒలింపియాడ్ కార్యక్రమ నోడల్ సెంటరుగా ఉన్న హోమీ భాభా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్ అంతర్జాతీయ ఒలింపియాడ్ సమాజంతో దేశాన్ని అనుసంధానిస్తోంది. ఈ సంస్థ ప్రీ యూనివర్సిటీ విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రం, గణితశాస్త్రాలంటే ఉన్న అసాధారణ ప్రతిభను గుర్తించి, పెంచి పోషించడానికీ, వారికి మార్గదర్శకత్వాన్ని అందించడానికీ అంకితమైన సంస్థ. దీనికోసం బహుళ దశల ఎంపిక ప్రక్రియనీ, పునశ్చరణ శిబిరాలనీ, ముమ్మర శిక్షణ కార్యక్రమాల్నీ నిర్వహిస్తోంది.

పతకాల విజేతలకు డీఏఈ కార్యదర్శి, అణు ఇంధన సంఘం చైర్మన్ డాక్టర్ అజీత్ కుమార్ మొహంతి అభినందనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ "మన యువ భౌతికశాస్త్ర నిపుణులు సాధించిన ఈ ఘన విజయం దేశ ప్రజలకు గర్వకారణం. అంతర్జాతీయ భౌతికశాస్త్ర ఒలింపియాడ్‌లో అయిదు బంగారు పతకాలు గెలవడంతో పాటు ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని సంయుక్తంగా సాధించడం మన విద్యార్థుల ప్రతిభ, అంకితభావం, విజ్ఞాన శాస్త్ర దృక్పథానికే కాక హెచ్‌బీసీఎస్ఈ-టీఐఎఫ్ఆర్ ఒలింపియాడ్ కార్యక్రమం దృఢ నిబద్ధతకు కూడా ఒక నిదర్శనంగా నిలిచింది. ఈ గొప్ప విజయాన్ని సాధించిన విద్యార్థుల్నీ, వారి తల్లితండ్రుల్నీ, గురువుల్నీ, మార్గదర్శకుల్నీ నేను అభినందిస్తున్నాను. వారి విజయం అనేక మంది యువ ప్రతిభావంతులకు విజ్ఞాన శాస్త్రంలో శ్రేష్ఠత్వాన్ని సంపాదించేందుకు స్ఫూర్తిని అందించడంతో పాటు విజ్ఞానశాస్త్ర విద్య, నూతన ఆవిష్కరణ రంగాల్లో పెరుగుతున్న నాయకత్వాన్ని కూడా పటిష్ఠపరుస్తోంది'' అన్నారు.

భారత్‌కు చెందిన మెరికల్లాంటి ప్రతిభావంతులను అంతర్జాతీయ వేదికపై రాణించేలా తీర్చిదిద్దడంలో అంకితభావాన్ని కనబరిచిన బృంద సారథులనూ అణు ఇంధన విభాగం అభినందించింది.

# ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి: సీపీఎం డిమాండ్




నల్గొండ, జులై 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానికంగా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కేంద్రం ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీని నిలబెట్టుకోవాలని, 10 లక్షల ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని, పోలీస్ శాఖలోని 20 వేల ఖాళీలను భర్తీ చేయాలని, నెలకు రూ. 5 వేల నిరుద్యోగ భృతితో పాటు జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలపై ఈ నెల 15న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, యువతకు కరుణాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండీ పాషా, నాయకులు బత్తుల దాసు, తూర్పునూరి మల్లేశం, అందగట్ల ఆనంద్, కనకయ్య, ఈదయ్య, జంగయ్య, రాములు, రాజు పాల్గొన్నారు.

# భారతదేశంలోనే తయారైన చిప్‌తో అత్యంత స్మార్ట్ డ్రోన్‌ల అభివృద్ధిపై విద్యార్థులకు పోటీ

న్యూఢిల్లీ, జులై 14:స్వయాన్ కార్యక్రమం కింద జాతీయ డ్రోన్ అప్లికేషన్, రీసెర్చ్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ రెండవ ఎడిషన్ (నిడార్ 2.0), 2026–27 ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఈఐటీవై), డ్రోన్ ఫెడరేషన్ ఇండియా (డీఎఫ్ఐ) ఈరోజు సంయుక్తంగా ప్రారంభించాయి. న్యూఢిల్లీలోని ఎలక్ట్రానిక్స్ నికేతన్‌లో హైబ్రిడ్ విధానంలో ఈ కార్యక్రమం జరిగింది. దేశవ్యాప్తంగా విద్యార్థులు, అధ్యాపకులు, ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగానూ, ఆన్‌లైన్ ద్వారానూ పాల్గొన్నారు.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ నిడార్ 2.0 కు సంబంధించిన సమస్య ప్రకటనలు, పోస్టర్, నియమావళి పుస్తకాలను ప్రారంభించారు. అనంతరం, ఎంఈఐటీవై అదనపు కార్యదర్శి, ఇండియా సెమీకండక్టర్ మిషన్ సీఈఓ శ్రీ అమితేష్ కుమార్ సిన్హా ప్రత్యేక ప్రసంగం చేశారు. ఎంఈఐటీవై సైంటిస్ట్ జి, గ్రూప్ కోఆర్డినేటర్ శ్రీమతి తూలిక పాండే, డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు శ్రీ స్మిత్ షా కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా స్వయాన్ సామర్థ్య పెంపు కార్యక్రమం గురించి, నిడార్ 2.0 పోటీ గురించి ముఖ్య అంశాలను వారు వివరించారు. ఎంఈఐటీవై, పౌర విమానయాన, రక్షణ, హోం మంత్రిత్వ శాఖల ఇతర ఉన్నతాధికారులు, డీజీసీఏ, సాయుధ దళాల ప్రతినిధులు, ప్రముఖ విద్యాసంస్థలు, పరిశ్రమల రంగానికి చెందిన ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ ఎస్. కృష్ణన్ మాట్లాడుతూ, ‘‘నిడార్ 2.0 మన విద్యార్థులను డ్రోన్‌లను ఎగరేసే స్థాయి నుంచి డ్రోన్ మెదడును సొంతంగా తయారుచేసే స్థాయికి తీసుకువెళుతుంది. డ్రోన్ మెదడు భారత స్వదేశీ వేగా ప్రాసెసర్‌పై పనిచేసినప్పుడు, మనం కేవలం ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వడం కాదు – స్వావలంబనతో కూడిన డ్రోన్ పరిశ్రమకు పునాది వేయడం. విదేశీ చిప్ డిజైన్‌లపై, వాటి లైసెన్సింగ్ ఖర్చులపై మన దేశం ఆధారపడటాన్ని తగ్గించడానికి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ చేపట్టిన డిజిటల్ ఇండియా ఆర్ఐఎస్సీ - వీ‘ (డిఐఆర్–వీ) కార్యక్రమంలో భాగంగానే ఈ ‘వేగా’ ప్రాసెసర్‌ను అభివృద్ధి చేశాం” అని అన్నారు.

నిడార్ (2025–26) మొదటి ఎడిషన్ 2025 మార్చిలో ప్రారంభమైంది. విపత్తు నిర్వహణ, కచ్చితత్వ వ్యవసాయం రంగాల కోసం స్వయంప్రతిపత్తి డ్రోన్ పరిష్కారాలను రూపొందించే ఈ పోటీలో 22 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాలు, 109 నగరాల నుంచి మొత్తం 3,448 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో తొంభై మూడు (93) బృందాలు గ్రాండ్ ఫినాలేకు చేరుకోగా వాటిలో ఇరవై నాలుగు బృందాలు మొత్తం రూ. 40 లక్షల విలువైన బహుమతులను గెలుచుకున్నాయి.

నిడార్ 2.0 ఈ పోటీ ప్రమాణాలను మరింత పైస్థాయికి తీసుకువెళుతోంది. ఇది సాంప్రదాయ ఎయిర్‌ఫ్రేమ్‌ల తయారీ నుంచి స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థలు, స్వదేశీ ఏవియానిక్స్, డ్రోన్ ప్రధాన భాగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఈ పోటీ రెండు విభాగాలుగా సాగనుంది.

ట్రాక్ 1 (డ్రోన్ ఇన్నోవేషన్): ఈ విభాగం కింద విపత్తు సంభవించిన ప్రాంతాలలో, ఎలాంటి బాహ్య కమ్యూనికేషన్ నెట్‌వర్క్ లేనప్పటికీ, ప్రమాదంలో చిక్కుకున్న వారిని గుర్తించి వారికి వైద్య సహాయ సామగ్రిని అందించగల పూర్తి స్వయంప్రతిపత్తి కలిగిన ‘స్వామ్ డ్రోన్‌లను’ రూపొందించాల్సి ఉంటుంది. పారిశ్రామిక తనిఖీల కోసం జీపీఎస్ సిగ్నల్స్ అస్సలు అందని ఇరుకైన ఇండోర్ ప్రదేశాలలో కూడా సులువుగా ప్రయాణించగల డ్రోన్‌ను తయారు చేయాలనే పోటీ కూడా ఈ విభాగం లో ఉంది.

ట్రాక్ 2 విడిభాగాల (కాంపోనెంట్) ఆవిష్కరణ: స్వదేశీ ఎలక్ట్రానిక్ భాగాలను ఉపయోగిస్తూ, వేగా ప్రాసెసర్ ఆధారంగా రూపొందించిన ఒక స్వదేశీ ఫ్లైట్ కంట్రోలర్, ఆటోపైలట్‌ను డిజైన్ చేయాలి. సాంకేతిక మూల్యాంకనం తర్వాత, మొదటి 100 బృందాలకు అభివృద్ధి, పరీక్ష, అనుసంధానం ఒక్కొక్కరికీ రెండు వేగా ప్రాసెసర్ కిట్‌లు అందిస్తారు.

వేగా ప్రాసెసర్ ఓపెన్ స్టాండర్డ్ ఆర్ఐఎస్సీ–వీ ఆర్కిటెక్చర్ ఆధారంగా, ఎంఈఐటీవై మైక్రోప్రాసెసర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ – డాక్) ద్వారా డిజైన్ చేసిన స్వదేశీ మైక్రోప్రాసెసర్‌ల శ్రేణి. ఈ ప్రాసెసర్‌ను కాంపోనెంట్ ఇన్నోవేషన్ ట్రాక్ కేంద్ర బిందువుగా ఉంచడం ద్వారా, భారతీయ డ్రోన్‌ల నియంత్రణ వ్యవస్థలను భారతదేశంలోనే తయారైన చిప్‌లపై రూపొందించేలా నిడార్ 2.0 విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

విస్తృత పరిధికి అనుగుణంగా, నిడార్ 2.0 బహుమతి నిధి రూ. 65 లక్షలకు పైగా పెరిగింది. విజేతలుగా నిలిచిన బృందాలు తమ ప్రోటోటైప్‌లను వాణిజ్య ఉత్పత్తులుగా మార్చుకోవడానికి వీలుగా కార్పొరేట్ ఇంటర్న్‌షిప్‌లు, ఇంక్యుబేషన్ సపోర్ట్, క్లౌడ్ కంప్యూటింగ్ క్రెడిట్‌లను కూడా పొందుతాయి. పౌర, రక్షణ డ్రోన్‌లు రెండూ చాలా వరకు ఒకే విధమైన కోర్ టెక్నాలజీని పంచుకుంటాయి. అందువల్ల, నిడార్ నుంచి వచ్చే ఆలోచనలు ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యాలకు అనుగుణంగా పౌర, రక్షణ రంగాల అనువర్తనాలు రెండింటినీ బలోపేతం చేయగలవు.

జూలై 2022లో దాదాపు రూ. 89.87 కోట్ల వ్యయంతో ఐదేళ్ల కాలానికి ఎంఈఐటీవై ఆమోదించిన స్వయాన్ చొరవ, భారత డ్రోన్ రంగానికి అవసరమైన నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఏరోమెకానిక్స్, డ్రోన్ ఎలక్ట్రానిక్స్, జీఎన్సీ అల్గారిథమ్స్, సిమ్యులేషన్, డ్రోన్ అప్లికేషన్స్, అనుబంధ యూఏఎస్ సాంకేతికతలు అనే ఐదు కార్యాచరణ అంశాలతో ఐఐఎస్సీ, ఐఐటీలు, ఎన్ఐటీలు, సీ– డాక్, ఎన్ఐఈఎల్ఐటీలతో సహా 30 ప్రముఖ సంస్థల హబ్–అండ్–స్పోక్ మోడల్ ద్వారా నడుస్తుంది. ఈ ప్రాజెక్ట్ ఇప్పటివరకు 51,000మందికి పైగా శిక్షణ ఇచ్చింది. ఇది డ్రోన్ టెక్నాలజీలో ఎం.టెక్, మైనర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు, రెట్రోఫిట్టింగ్ ఎలెక్టివ్‌లు, ఆన్‌లైన్ కోర్సులు, పరిశోధనా పత్రాలు, పేటెంట్‌లకు కూడా మద్దతు ఇచ్చింది. నిడార్ దీని ప్రధాన ఇన్నోవేషన్ ప్లాట్‌ఫారమ్.

# దేశవ్యాప్తంగా 7 ఈఎస్ఐసీ ఆరోగ్య ప్రాజెక్టులకు ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, జులై 14:తెలంగాణలోని సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి నుంచి దేశవ్యాప్తంగా 7 ఈఎస్ఐసీ ఆరోగ్య ప్రాజెక్టులను ఈ నెల 14న కేంద్ర కార్మిక–ఉపాధి, యువజన వ్యవహారాలు–క్రీడా శాఖల మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రిలోని కొత్త ఓపీడీ విభాగాన్ని కూడా ప్రారంభిస్తారు. మిగిలిన 6 ప్రాజెక్టులను ఆన్లైన్ మాధ్యమం ద్వారా ప్రారంభిస్తారు. వీటిలో... అస్సాంలోని బెల్తోలా 200 పడకల ఆసుపత్రిని ఉన్నతీకరించారు. అలాగే, తమిళనాడు శ్రీపెరంబుదూర్‌లో 100 పడకల ఆసుపత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. రాజమహేంద్రవరంలో ఆసుపత్రి; గుజరాత్ రాష్ట్రం.. సురేంద్రనగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీ శాఖ, రాజస్థాన్ రాష్ట్రం.. కోట ఉద్యోగ్ నగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీ శాఖ, అదే రాష్ట్రంలోని భవానీ మండి ఈఎస్ఐ డిస్పెన్సరీ ఉన్నాయి. వీటన్నిటినీ ?668 కోట్ల వ్యయంతో నిర్మించగా, దేశవ్యాప్తంగా గల సుమారు 53 లక్షల మంది లబ్ధిదారులకు వైద్య సేవలు లభిస్తాయి.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర కార్మిక–ఉపాధి, సూక్ష్మ–చిన్న–మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే కూడా పాల్గొంటారు. సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆసుపత్రి ఓపీడీ విభాగం నిర్మాణ కార్మికులను డాక్టర్ మాండవీయ సత్కరిస్తారు. తద్వారా దేశ పురోగమనములో వారి పాత్రను ప్రస్ఫుటం చేస్తారు. దీంతోపాటు కార్మిక సంక్షేమంపై ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను అందజేస్తారు.

సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల, ఆసుపత్రిలోని కొత్త ఓపీడీ విభాగం ఒక కీలక సదుపాయం. ఇక్కడ తెలంగాణలోని హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 12,30,183 మంది బీమా చందాదారులు, వారి కుటుంబ సభ్యులకు ఆధునిక, సమగ్ర సేవలు లభిస్తాయి.

మొత్తం 43,611.04 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ?211.13 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విభాగంలో జనరల్ మెడిసిన్, ఈఎన్టి, డెంటల్, గైనకాలజీ, నేత్ర, ఆర్థోపెడిక్స్, సైకియాట్రీ, చర్మ, ఊపిరితిత్తుల, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, ఆయుష్ ఓపిడీలు కూడా ఉన్నాయి. వీటితో పాటు ఫిజికల్ మెడిసిన్, రేడియాలజీ, యోగా, 180 సాధారణ పడకలు (మూడు 60 పడకల వార్డులు), 25 ఐసీయూ, 20 ఎన్ఐసీయూ పడకలు, మందుల దుకాణం, క్లినికల్ లెక్చర్ థియేటర్ ఉన్నాయి.

హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో 1975 మార్చి 30 నుంచి ఈఎస్ఐ పథకం అమలవుతోంది. ప్రస్తుతం ఈఎస్ఐసీ 2.0 సంస్కరణల కింద తెలంగాణలోని 33 జిల్లాలకూ ఈ పథకం వర్తిస్తుంది. దీంతో రాష్ట్రంలో 19,15,700 మంది బీమా చందాదారులు, 74,32,916 మంది లబ్ధిదారులకు సామాజిక భద్రత లభిస్తుంది.

అస్సాంలోని బెల్ తోలలో ఈఎస్ఐ ఆసుపత్రి ద్వారా మేఘాలయలోని 47 జిల్లాలతోపాటు త్రిపుర, మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని 41 జిల్లాలకు సేవలు అందుతాయి. తద్వారా 3.42 లక్షల మంది బీమా చందాదారులు సహా మొత్తం 13.27 లక్షల మంది లబ్ధిదారులకు ఆరోగ్య సేవలు లభిస్తాయి.

తమిళనాడులో ప్రముఖ తయారీ, ఎలక్ట్రానిక్స్ కూడలిగా ఎదిగిన శ్రీపెరంబుదూర్‌లో 100 పడకల ఈఎస్ఐసీ ఆసుపత్రి ఉంది. ఇక్కడ ఓపీడీ, అత్యవసర సేవలు, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఐపీడీ, ఎక్స్–రే, ల్యాబ్, ఫార్మసీ సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. దీని ద్వారా కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాల్లోని 5.5 లక్షల మందికి పైగా బీమా చందాదారులకు సేవలు లభిస్తాయి.

రాజమహేంద్రవరం ఈఎస్ఐఎస్ ఆసుపత్రిలో 1,31,190 మంది బీమా చందాదారులు సహా మొత్తం 2,52,717 మంది లబ్ధిదారులకు సేవలు లభిస్తాయి. ఇక్కడ రోగుల కోసం 26 ఓపీడీ గదులు, 3 ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఇతర కీలక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

సురేంద్రనగర్ జిల్లాలో సుమారు 9,192 మంది బీమా చందాదారులు ఉన్నారు. ఈ శాఖ ద్వారా సుమారు 35,000 మంది లబ్ధిదారులకు వైద్య సేవలు, సామాజిక భద్రతా ప్రయోజనాలు లభిస్తాయి. అలాగే, ప్రాథమిక ఆరోగ్య సేవలు, వైద్య సంప్రదింపులు, అవసరమైన మందులు సహా అన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయి.

రాజస్థాన్లోని కోట పారిశ్రామిక ప్రాంతంలోని బీమా కార్మికులు, వారి కుటుంబాలకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది. ఇక్కడ 1,500 మందికి పైగా యజమానులు, సుమారు 75,000 మంది బీమా చందాదారులు సహా మొత్తం 2,91,000 మందికి ఇక్కడ సేవలు లభిస్తాయి.

రాజస్థాన్‌లోని ప్రధాన వస్త్ర కేంద్రమైన భవానీ మండి పారిశ్రామిక ప్రాంత కార్మికుల కోసం ఈ డిస్పెన్సరీ ఏర్పాటైంది. ఇక్కడ సుమారు 800 మంది యజమానులు, 27,715 మంది బీమా చందాదారులు సహా మొత్తం 1,07,535 మందికి ఆరోగ్య సేవలు లభిస్తాయి.

## విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ




నల్గొండ, జులై 14:విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ ఐదో వార్డు కౌన్సిలర్ మొగుళ్ల అనురాధ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని బుజిలాపురం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో ఆమె స్వయంగా విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నులిపురుగుల కారణంగా పిల్లల్లో ఎదుగుదల మందగించడం, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు మింగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నిజామాబాద్, జులై 14:భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామానికి చెందిన కల్లెడ మమత, కల్లెడ రవికుమార్‌లకు ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బీజేపీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు అరె రవీందర్ మంగళవారం అందజేశారు.

ఈ సందర్భంగా అరె రవీందర్ మాట్లాడుతూ, అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. భీమ్‌గల్ మండలంలో ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ నాయకత్వంలో ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మెండోరా వీడీసీ చైర్మన్ చేగంటి గంగాధర్, ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు ముస్లి ఎర్రన్న, కార్యదర్శి గజానవేణి మోహన్, బీజేపీ జిల్లా నాయకుడు నాగార్జున్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు తక్కూరి అంజయ్య, సీనియర్ నాయకులు పార్వతి శ్రీనివాస్ గౌడ్, బూత్ అధ్యక్షులు వాల్గోట్ బాబూరావు, తక్కూరి రామ్, వాల్గోట్ భాస్కర్, నడుకుడ రమేష్, మోహన్, రాములు, దాస్, రాకేష్, ఆదిత్య, బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మార్కెట్ చైర్మన్ దంపతులు



నల్గొండ, జులై 14:తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమల, వెంకటేశ్వర్లు గౌడ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో బర్త్‌డే కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే సామెల్ మరెన్నో పుట్టినరోజులు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' ప్రచారంలో భాగంగా జిల్లా స్థాయి పోటీలకు రిజిస్ట్రేషన్లను ప్రారంభించిన మై భారత్

న్యూఢిల్లీ, జులై 14:వికసిత్ భారత–2047 లక్ష్యం దిశగా భారత్ ముందుకెళుతున్న తరుణంలో.. సామాజిక పరివర్తన రూపశిల్పులుగా యువతను తీర్చిదిద్దడం ముఖ్యం. మత్తుపదార్థాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలన్న ప్రధానమంత్రి పిలుపుతో.. మేరా యువ భారత్ (మై భారత్) ద్వారా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ (ఎంవైఏఎస్) దేశవ్యాప్తంగా నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ ప్రచారం తదుపరి దశను ప్రారంభించింది. దీనిలో భాగంగా 2026 జూలై 13 నుంచి దేశవ్యాప్తంగా జిల్లా స్థాయి పోటీలు ప్రారంభమవుతాయి. సృజనాత్మక, సంస్కృతీ, సామాజిక నాయకత్వ శక్తితో 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యసాధనకు దోహదపడుతూనే, నషా ముక్త్ భారత్ ఉద్యమానికి నాయకత్వం వహించేలా యువతను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యం.

వ్యవస్థీకృత జాతీయ వేదిక ద్వారా ఈ దృక్పథాన్ని ముందుకు తీసుకువెళ్లేలా.. ఈ పోటీలను మూడు దశల్లో నిర్వహిస్తారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో– మూడు దశలుగా నిర్వహించే ఈ పోటీలకు రిజిస్ట్రేషన్లు 2026 జులై 13న ప్రారంభమవుతాయి. 2026 జులై 24 నుంచి 27 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. ప్రతి విభాగంలోనూ తొలి మూడు స్థానాల్లో నిలిచిన వారిని ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచినవారు 2026 జులై 30 నుంచి ఆగస్టు 6 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అనంతరం, రాష్ట్ర ఛాంపియన్‌లను 2026 ఆగస్టు 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయిలో జరిగే ఫైనల్స్‌కు ఆహ్వానిస్తారు. అక్కడ దేశవ్యాప్తంగా ఎంపికైన అత్యుత్తమ యువ ప్రతిభావంతులు జాతీయ యువజన సదస్సులో తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తారు.

యువత నేతృత్వంలోని సృజనాత్మక వ్యక్తీకరణ శక్తే ఈ ప్రచారానికి ప్రధాన కేంద్రంగా ఉంది. నృత్యం, సంగీతం, రీల్–షార్ట్ ఫిల్మ్, నుక్కడ్ నాటక్, స్లామ్ పొయెట్రీ అనే అయిదు సృజనాత్మక విభాగాలలో జిల్లా స్థాయి పోటీలను మై భారత్ నిర్వహిస్తుంది. సంస్కృతి, కథనం, సంగీతం, డిజిటల్ సృజనాత్మకతను మేళవించడం ద్వారా ఈ పోటీలు... సమాజంలో స్ఫూర్తి నింపడానికీ, తమ తోటివారిని ప్రభావితం చేయడానికీ, మాదకద్రవ్య రహిత భారతదేశ సందేశాన్ని విస్తృతం చేయడానికీ అవసరమైన ఒక ప్రత్యేకమైన వేదికను యువతకు అందిస్తాయి.

విస్తృతమైన, సమ్మిళితమైన భాగస్వామ్యాన్ని ఈ పోటీల్లో ప్రోత్సహిస్తున్నారు. 15 నుంచి 29 ఏళ్ల వయసు వరకు ఉన్న యువత ఈ పోటీల్లో వ్యక్తిగత, బృంద విభాగాల్లో పాల్గొనవచ్చు. తమ సృజనాత్మక ఆలోచనలను హిందీ, ఇంగ్లీష్ లేదా ఏదైనా ప్రాంతీయ భాషలో సమర్పించవచ్చు. తద్వారా ప్రాంతీయ లేదా భాషాపరమైన భేదం లేకుండా ప్రతి యువ గళానికి ఈ జాతీయ ఉద్యమంలో భాగమయ్యే అవకాశం లభిస్తుంది.

జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే ప్రక్రియను సులభతరం చేస్తూ.. 2026 జులై 13 నుంచి మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయి. ఈ పోర్టల్ ద్వారా యువత నమోదు చేసుకొని, తమ సృజనాత్మక ఎంట్రీలను సమర్పించవచ్చు. ఈ ప్రక్రియను పోటీలకు తొలి దశగా పరిగణిస్తారు.

అమృత కాలంలో సామాజిక మార్పు కోసం సృజనాత్మకతను ఓ శక్తిగా ఉపయోగించుకోవడానికి, నషా ముక్త్ భారత్ లక్ష్యానికి దోహదపడటానికి, వికసిత్ భారత్ దార్శనికతతో తమ శక్తినీ, ఆకాంక్షలను అనుసంధానించుకోవడానికీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యువ భారత్ పోర్టల్ ద్వారా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువతను కోరింది.

# పుణేలో హైటెక్ ఎండీ తయారీ ప్రయోగశాలను ధ్వంసం చేసిన సీబీఎన్ మధ్యప్రదేశ్ విభాగం

న్యూఢిల్లీ, జులై 14:సింథటిక్ మాదక ద్రవ్యాల అంతరాష్ట్ర అక్రమ రవాణా ముఠాకు వ్యతిరేకంగా చేపడుతున్న ఆపరేషన్లో భాగంగా నార్కోటిక్స్ సెంట్రల్ బ్యూరో (సీబీఎన్) మధ్యప్రదేశ్ విభాగం కీలక విజయం సాధించింది. మహారాష్ట్రలోని పుణేలో ఉన్న మెఫెడ్రోన్ (ఎండీ) తయారీ ప్రయోగశాలని ధ్వంసం చేసింది. అలాగే ఆపరేషన్ వజ్ర చేపట్టి ఈ ముఠాకు చెందిన ఇద్దరు ప్రధాన సూత్రధారులను ఉజ్జయిని (మధ్యప్రదేశ్), జోధ్‌పూర్ (రాజస్థాన్)లో అరెస్టు చేసింది.

నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా.. నీమచ్‌లోని సీబీఎన్, డిప్యూటీ నార్కోటిక్స్ కమిషనర్ కార్యాలయం పరిధిలోని నిరోధక విభాగం ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది. 2026 జులై 1 నుంచి 10 తేదీల మధ్య దర్యాప్తు, సమన్వయ కార్యకలాపాలను చేపట్టారు.

ఈ ఆపరేషన్‌లో భాగంగా అక్రమంగా ఎండీ తయారు చేస్తున్న అత్యాధునిక ప్రయోగశాలను సీబీఎన్ స్వాధీనం చేసుకుంది. దీనిలో సింథటిక్ డ్రగ్స్ తయారీలో ఉపయోగించే అత్యాధునిక యంత్రాలు, ప్రయోగశాల పరికరాలు, ముడి రసాయనాలు, భద్రతా పరికరాలను సీజ్ చేసింది. ఎన్‌డీపీఎస్ చట్టం–1985 ప్రకారం ప్రధాన కుట్రదారులతో సహా ఇద్దరిని అరెస్టు చేశారు.

2026 ఫిబ్రవరిలో మందసౌర్ వద్ద ఒక బస్సులో 8.17 కిలోల మెఫెడ్రోన్‌ను సీబీఎన్, నీముచ్ స్వాధీనం చేసుకోవడంతో ఈ దర్యాప్తు ప్రారంభమైంది. దీనికి కొనసాగింపుగా ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. తదనంతర సోదాల ఫలితంగా మవూలోని థావ్లేలో అక్రమంగా నిర్వహిస్తున్న లెబొరేటరీని గుర్తించారు. ఇక్కడ 43.82 కిలోల మెఫెడ్రోన్, 261.32 కిలోల ముడి రసాయనాలు, అధునాతన తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

నిరంతర నిఘా, విస్తృతమైన అంతర్రాష్ట్ర దర్యాప్తు ఆధారంగా, నకిలీ గుర్తింపు పత్రాలను వాడుతూ తరచూ వివిధ రాష్ట్రాలకు మకాం మారుస్తూ పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారిని నిరోధక విభాగానికి చెందిన బృందం అదుపులోకి తీసుకుంది. ఉజ్జయిని పోలీసులు అందించిన సహకారంతో రహస్యంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో 2026 జూలై 3వ తేదీ అర్ధరాత్రి ఉజ్జయినిలో నిందితుడిని అరెస్టు చేశారు.

పుణేలోని భోస్రీ వద్ద డిగ్గీలో మరో అత్యాధునికమైన ఎండీ తయారీ యూనిట్లను ఈ సిండికేట్ ఏర్పాటు చేసినట్లు విస్తృత దర్యాప్తులో తేలింది.

# దేశంలోని అనేక వన్యప్రాణి అక్రమ రవాణా ముఠాల గుట్టు రట్టు చేసిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ)

హైదరాబాద్, జులై 14:దేశంలో వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠాలపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు పటిష్ట నిఘాతో దేశమంతటా నిర్వహించిన అనేక వరుస దాడులలో 440కిపైగా అంతరిస్తున్న-రక్షిత వన్యప్రాణులు సహా 15 కిలోల మేర ఏనుగు దంతాలు, దంత వస్తువులను స్వాధీనం చేసుకుంది. ఈ దాడుల సందర్భంగా 33 మంది వన్యప్రాణుల అక్రమ రవాణాదారులను అరెస్టు చేసింది.

దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... రాజస్థాన్‌లోని సుజన్‌గఢ్ సమీపాన 10.07.26 నాడు ఏనుగు దంతాల అక్రమ వ్యాపారం చేసే కొందరు వ్యక్తులను పటిష్ఠ నిఘాతో అధికారులు దిగ్బంధించారు. వారి నుంచి సుమారు 11 కిలోల ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అక్రమ రవాణా దారులను, ఏనుగు దంతాలను అటవీ శాఖకు అప్పగించారు. వీరిపై వన్యప్రాణి (సంరక్షణ) చట్టం-1972 కింద అటవీ శాఖ కేసులు నమోదు చేసి చర్యలు చేపడుతుంది. భారతీయ ఏనుగులు (ఎలిఫాస్ మాక్సిమస్), వాటి దంతాలు ఇతర భాగాలతో వ్యాపారం ఈ చట్టంలోని షెడ్యూల్-ఎ కింద నిషేధం. దీంతోపాటు "అంతరించిపోతున్న వన్యప్రాణులు- వృక్షజాతుల అంతర్జాతీయ వాణిజ్యంపై ఒప్పందం'' (సీఐటీఈఎన్) భాగస్వామ్య దేశాల్లో ఒకటైన భారత్‌లోనూ ఏనుగు దంతాల వ్యాపారంతోపాటు విదేశీ వాణిజ్య విధానం కింద ఏనుగు దంతాల ఎగుమతి-దిగుమతులపైనా నిషేధం ఉంది.

అంతకుముందు బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా రవాణా చేసినట్లు భావిస్తున్న రెండు దంతపు దేవతా విగ్రహాలను పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు వ్యక్తులను డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

అలాగే, కర్ణాటకలోని మైసూరులో దాడుల సందర్భంగా 4 కిలోల ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకోవడం సహా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తదుపరి చర్యల నిమిత్తం అటవీ శాఖకు అప్పగించారు.

మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ లోని వివిధ ప్రాంతాల్లో ఈ నెల 7-8 తేదీలలో నిర్వహించిన దాడులలో ఒక అంతర్రాష్ట్ర వన్యప్రాణుల అక్రమ రవాణా ముఠా గుట్టును డీఆర్ఐ అధికారులు రట్టు చేశారు. ఈ మేరకు ముంబైలోని డీఆర్ఐ, సీబీఐ, ఎకనామిక్ అఫెన్సెస్ విభాగం (ఈఓబీ) వైల్డ్‌లైఫ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో (డబ్ల్యూసీసీబీ) సహకారంతో తొలిసారి సంయుక్తంగా భారీ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల (సంరక్షణ) చట్టం-1972లోని షెడ్యూల్-ఎ కింద వన్యప్రాణుల జాబితాలోగల "15 స్లో లోరిస్‌లు, 2 బింటురాంగ్‌లు, 28 నక్షత్ర తాబేళ్లు, 6 ఈజిప్షియన్ రాబందులు, 2 షిక్రా పక్షుల"ను స్వాధీనం చేసుకున్నారు. ఈ జంతువుల అక్రమ రవాణాపై డీఆర్ఐ సమాచారం సేకరించి, దాడులు నిర్వహించారు. ప్రస్తుతం దీనిపై సీబీఐ దర్యాప్తు చేపట్టి, ఆరుగురు నిందితులను తొలుత అదుపులోకి తీసుకుని, ప్రాథమిక ఆధారాలతో వారిని అరెస్టు చేసింది.

బ్యాంకాక్, కౌలాలంపూర్, కొలంబో నుంచి లోగడ కొందరు ప్రయాణికులు అంతర్జాతీయ విమానాశ్రయాల ద్వారా సంరక్షిత వన్యప్రాణులను భారత్‌లోకి తరలించేందుకు చేసిన అనేక ప్రయత్నాలను డీఆర్ఐ భగ్నం చేసింది. ఆయా సందర్భాల్లో "ఆల్బినో ఎర్ర చెవుల తాబేలు, హైపో జీరో బియర్డెడ్ డ్రాగన్, ఆఫ్రికన్ స్పర్డ్ తాబేలు, బోర్నియో కొండచిలువ, ఆకుపచ్చ ఇగ్వానా, మడ అడవి బల్లి, అర్జెంటీనా నలుపు-తెలుపు టెగు, గోల్డీ మార్మోసెట్, యెల్లో చీక్ గిబ్బన్, ఇండోనేషియన్ బ్లూటంగ్ స్కింక్, సియామాంగ్ గిబ్బన్, వూలీ మంకీ, సిల్వరీ లుటంగ్, యెల్లో బెల్లీ బాల్ పైథాన్, పాస్టెల్ బాల్ పైథాన్" తదితర జంజాతులను రక్షించారు.

అదేవిధంగా బెంగళూరు, వరంగల్, పుణె, సూరత్, చెన్నై, కోల్‌కతా, తిరుచ్చి, మదురై, శ్రీకాకుళం, హోజై (అస్సాం) సహా రాజస్థాన్, మైసూరు, హౌరాలలో డీఆర్ఐ ఇతర ప్రభుత్వ సంస్థల సమన్వయంతో నిఘా-దాడులు చేపట్టింది. ఆయా సందర్భాల్లో "పంగోలిన్ పొలుసులు, చిరుతపులి చర్మం, సముద్ర గుర్రం ఆధారిత వన్యప్రాణి వస్తువులు, ఎర్రచందనం, రక్షిత జాతులైన గిబ్బన్లు, బల్లులు, తాబేళ్లు, పక్షులు, ఉడుతలు, పాములు, రెడ్ సాండ్ బోవా" వంటి అనేక వన్యప్రాణులు-ఉత్పత్తులను స్వాధీనం చేసుకుంది.

ఈ కార్యకలాపాలలో అధికశాతం సీబీఐ, డబ్ల్యూసీసీబీ సహా బెంగళూరు, కోల్‌కతా, తిరుచ్చి, మదురైలలోని కస్టమ్స్ ఎయిం పోర్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్లు, రాష్ట్ర అటవీ శాఖలు, స్థానిక పోలీసు అధికారులు తదితర చట్టబద్ధ సంస్థలతో సమన్వయం ద్వారా ఈ కార్యకలాపాలు నిర్వహించింది.

వ్యవస్థీకృత వన్యప్రాణి వ్యతిరేక నేరాల నిరోధం, అంతరించిపోతున్న జంతు-వృక్ష జాతుల అక్రమ రవాణా ముఠాలపై ఉక్కుపాదం మోపడంలో డీఆర్ఐ నిబద్ధతను ఈ నిరంతర నిఘా ఆధారిత కార్యకలాపాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మేరకు 'సీఐటీఈఎన్' కింద భారత్ బాధ్యతల కింద సహకరించడంతోపాటు దేశంలో సుసంపన్న జీవవైవిధ్య పరిరక్షణలోనూ డీఆర్ఐ తనవంతు పాత్ర పోషిస్తోంది.

## కాలువలో మృతదేహం కలకలం..

నిజామాబాద్, జులై 14: నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం వన్నెల్(బి) శివారులోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్‌పీ) వరద కాలువ వద్ద సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బాల్కొండ ఎస్సై శైలేందర్ తెలిపారు.

మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండొచ్చని, బట్టతలతో ఉన్నాడని పేర్కొన్నారు. అతని జేబులో అంబర్ పాన్ మసాలా ప్యాకెట్ లభ్యమైనట్లు తెలిపారు.

స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు బాల్కొండ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నికలు..




నిజామాబాద్, జులై 14:నగరంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నికలను సోమవారం ఉత్సాహభరితంగా నిర్వహించినట్లు పాఠశాల చైర్మన్ పాకాల నరసింహారావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతో పటిష్టమైనదని, నేటి విద్యార్థులే భావి భారత ఆశాకిరణాలని అన్నారు. సాధారణ ఎన్నికల తరహాలోనే పాఠశాలలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను విద్యార్థులకు పరిచయం చేస్తున్నామని తెలిపారు.

ఎన్నికలకు ముందే ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రజాస్వామ్యం, ఓటు విలువ, సమర్థత, నిస్వార్థ సేవాభావం కలిగిన నాయకుడిని ఎన్నుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన పెంపొందించి, ఉత్తమ నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి ఏడాది ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ ఎన్నికల్లో పాల్గొంటారని తెలిపారు.

పాఠశాల ప్రిన్సిపాల్ లతా గౌడ్ మాట్లాడుతూ, స్కూల్ పీపుల్ లీడర్, స్కూల్ అసిస్టెంట్ పీపుల్ లీడర్, స్కూల్ గేమ్స్ లీడర్, స్కూల్ కల్చరల్ లీడర్, స్కూల్ గ్రూప్ లీడర్ తదితర పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు రాజకీయ పార్టీల తరహాలో రెడ్ వారియర్స్, ఎల్లో అలయన్స్, గ్రీన్ జీన్స్, పింక్ పాంథర్స్ పేర్లతో ఏర్పాటైన బృందాల తరఫున పోటీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి భద్రత కలిగిన నగరాలే లక్ష్యంగా 'క్యాచ్ ది రెయిన్' ప్రచారాన్ని వేగవంతం



న్యూఢిల్లీ, జులై 14:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపు మేరకు "వర్షాన్ని ఒడిసిపట్టండి-ఎక్కడ కురిస్తే అక్కడ, ఎప్పుడు కురిస్తే అప్పుడు" నినాదంతో సాగుతున్న జల సంరక్షణ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అమృత్ 2.0 పథకం కింద దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, జలాశయాల పునరుజ్జీవన కార్యక్రమాలను పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్తోంది.

అమృత్ 2.0 కింద నీటి భద్రతను పటిష్ఠం చేయడం, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడం కోసం దేశంలోని వివిధ నగరాలు వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పునరుద్ధరణ, స్థిరమైన నీటి నిర్వహణ పద్ధతులను వేగవంతం చేశాయి. ఈ జాతీయ స్థాయి ఉద్యమంలో 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 900 పట్టణ స్థానిక సంస్థలు అత్యంత చురుగ్గా పాల్గొంటున్నాయి.

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జలశక్తి మంత్రిత్వ శాఖతో కలిసి జలశక్తి అభియాన్-జన భాగీదారి (జేఎస్‌జేబీ) 2.0కింద భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా 79 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 1,99,278 భూగర్భ జలాల పునరుద్ధరణ నిర్మాణాలను చేపట్టారు. అదేవిధంగా 738 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మరో 73,036 ఇంకుడు నిర్మాణాల పనులు శరవేగంగా సాగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టాలను పెంచడానికి, నీటి సంరక్షణ లక్ష్యాలను సాధించడానికి ఈ నిర్మాణాలు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

జల సంరక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడానికి అమృత్ 2.0 కింద పద్ధతిలో భూగర్భ జల పొరల మ్యాపింగ్, నిర్దేశిత లక్ష్యాలతో నిస్సార భూగర్భ జల పొరల నిర్వహణ (ఎస్ఏఎం) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం దేశంలోని పలు నగరాల్లో అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. పశ్చిమ బెంగాల్‌లోని బుర్ద్వాన్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం నగరాలలో ఇంజక్షన్ బోర్‌వెల్స్‌తో అనుసంధానించిన ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని భూగర్భ పొరల్లోకి పంపుతున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో నిల్వ సదుపాయాలతో కూడిన ఇంటి పైకప్పు వర్షపు నీటి నిల్వ పద్ధతులు.. అటు నీటి పొదుపునకు, ఇటు భూగర్భ జలాల పెంపునకు ఏకకాలంలో దోహదపడుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా, తెలంగాణలోని వరంగల్ నగరాలు వర్షాకాలం కంటే ముందే ఇంకుడు నిర్మాణాలను సిద్ధం చేయడం ద్వారా రుతుపవన వర్షాలను భూగర్భ జలాల పునరుద్ధరణకు సమర్థవంతంగా వినియోగించుకుంటున్నాయి.

అమృత్ 2.0 లోని జలాశయాల పునరుజ్జీవన (డబ్ల్యూబీఆర్) విభాగం కింద దేశవ్యాప్తంగా సుమారు 1.21 లక్షల ఎకరాల విస్తీర్ణంలోని జలాశయాలను పునరుద్ధరిస్తున్నారు. నగరాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, భూగర్భ జలాల మట్టాలను ఉధృతం చేయడం, వరదలను తట్టుకునే శక్తిని నగరాలకు కల్పించడం కోసం ఈ చర్యలు ఉపయోగపడతాయి. ఇందులో భాగంగా పూడికతీత, నీటి ప్రవేశ, నిష్క్రమణ మార్గాల మెరుగుదల, చెరువు గట్ల రక్షణ, పరిసరాల సుందరీకరణ, జీవవైవిధ్య పెంపుదల వంటి పనులను వేగంగా చేపడుతున్నారు.

ఈ జల సంరక్షణ చర్యలకు అదనంగా పట్టణ ప్రాంతాల్లో 18,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో పార్కులు, పచ్చని ప్రదేశాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భూగర్భ జలాల రీఛార్జ్‌కు మద్దతు ఇస్తాయి. నగరాల్లో వేడి తీవ్రతను తగ్గించి, ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రజా స్థలాలను అందుబాటులోకి తేవడం ద్వారా పౌరుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయి.

ఈ వినూత్న కార్యక్రమాల ద్వారా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 'వర్షాన్ని ఒడిసిపట్టండి-ఎక్కడ కురిస్తే అక్కడ, ఎప్పుడు కురిస్తే అప్పుడు' అనే దార్శనికతను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

'నేడు మనం పొదుపు చేసే ప్రతి నీటి చుక్క.. కాబోయే తరాల నీటి భద్రత కోసం మనం పెట్టే పెట్టుబడి'

# ఎస్ఐఆర్ ప్రక్రియను ఈ నెల 24లోగా పూర్తి చేయాలి: కలెక్టర్



మహబూబ్‌నగర్, జులై 14:ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఈ నెల 24లోగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ ఏమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు పరిధిలోని 112, 113 పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. పట్టణంలో ఇప్పటివరకు 32 శాతం మాత్రమే నమోదు పూర్తయిందని పేర్కొంటూ, బూత్ లెవల్ అధికారులు, బీఎల్ఏలు, మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఈ నెల 24లోగా వంద శాతం నమోదు పూర్తి చేయాలని సూచించారు.

అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని సందర్శించి దివ్యాంగులకు జారీ చేస్తున్న ధ్రువపత్రాల ప్రక్రియ, కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలున్న వారికి ప్రాధాన్యత కల్పించి పారదర్శకంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే మహిళా కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంల తయారీ కేంద్రాన్ని సందర్శించి ఆగస్టు 15లోపు విద్యార్థులందరికీ యూనిఫాంలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అర్చన, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, డీఆర్‌డీఏ అధికారి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# దైనందిన సమస్యలకు ధ్యానం ద్వారా పరిష్కారం

### -ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షకులు ధ్యాన గురువు డా॥అరవింద్ పద్మరాజు




హైదరాబాద్, జులై 14:దైనందిన సమస్యలకు ధ్యానం పరిష్కార మార్గం చూపిస్తుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ధ్యాన గురువు డా.అరవింద్ పద్మరాజు అన్నారు. హైదరాబాదులోని కన్హా శాంతివనంలో గత నాలుగు రోజులుగా జరిగిన 'హ్యాపీ వారియర్స్ రిట్రీట్ - 2026' కార్యక్రమం ముగింపు సమావేశంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు.

శరీరం, మనస్సులపై దృష్టి కేంద్రీకరించి, శ్వాసను పరిశీలిస్తూ ధ్యానం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చని డా.అరవింద్ పద్మరాజు చెప్పారు. మనుషులు ఎదుర్కొంటున్న ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులను ధ్యానం ద్వారా అధిగమించవచ్చని ఆయన అన్నారు. వృత్తిపరమైన అభివృద్ధికి కూడా ధ్యానం ఉపకరిస్తుందని తెలిపారు. మానవసంబంధాల పెంపుదలలో ధ్యానానికి ఉన్న పాత్ర గొప్పదని ఆయన చెప్పారు. పీనియల్ గ్రంధిని ఉత్తేజితం చేయడం ద్వారా సమస్యల పరిష్కార మార్గం లభిస్తుందని ఆయన వివరించారు. భావోద్వేగాల నియంత్రణను కూడా సాధించవచ్చని డా.అరవింద్ పద్మరాజు తెలిపారు. వాకింగ్ మెడిటేషన్, ఈ ఎఫ్ టి ట్యాపింగ్, చక్ర మెడిటేషన్ మొదలైన పద్ధతులను ఉపయోగించి, ఉత్తమ ఫలితాలు పొందవచ్చని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా గత నాలుగు రోజుల శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాసం, ధ్యానం రంగాల శిక్షకులు అపూర్వ, అంబికా అయ్యర్, శివ, చరణ్, ల్యాకీ, రూపాలి, రాణీ మోల్, డా.ప్రశాంతి, జయశ్రీ రావు తదితరులు పాల్గొన్నారు. భారతదేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు అమెరికా, దక్షిణాఫ్రికా, అరబ్ ఎమిరేట్స్, యు.కె. తదితర దేశాల నుండి ధ్యాన అభ్యాసకులు హాజరయ్యారు.

## వేవ్స్ 2027 క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ సీజన్ 2 కింద పరిశ్రమల నేతృత్వంలోని సవాళ్ల కోసం ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్న సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 14:భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వరల్డ్ ఆడియో విజువల్, ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్) ఆధ్వర్యంలో 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్ (సీఐఎస్)-సీజన్ 2 అనే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా మీడియా, వినోద రంగంలో పనిచేస్తున్న వివిధ పరిశ్రమల సంఘాలు, సంస్థలు, విద్యాసంస్థల నుంచి పరిశ్రమల నేతృత్వంలోని సవాళ్ల రూపకల్పన, నిర్వహణ కోసం ప్రతిపాదనల ను మంత్రిత్వ శాఖ ఆహ్వానిస్తోంది. సీజన్ 2 కింద వచ్చే ప్రతిపాదనలను స్వీకరించడానికి, పారదర్శకమైన, ప్రతిభ ఆధారిత విధానంలో అర్హులైన సంస్థలను ఎంపిక చేయడానికి ప్రత్యేక ఏకీకృత వేదికను కూడా సిద్ధం చేశారు.

యువత కేంద్రంగా పరిశ్రమల ఆధ్వర్యంలో, ప్రభుత్వ మద్దతుతో నడిచే సవాళ్లను పరిష్కరించడమే సీఐసీ సీజన్ 2 లక్ష్యం. సృజనాత్మకత గల ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధిని పెంచడం, సామర్థ్య నిర్మాణం, మార్గదర్శకత్వం ఇవ్వడం, సరికొత్త ఆవిష్కరణలకు ఊతమివ్వడం వంటి పనులను దీని ద్వారా చేపడతారు.

కృత్రిమ మేధ, ఏవీజీసీ-ఎక్స్ఆర్, డిజిటల్ మీడియా వంటి సాంకేతిక ఆధారిత సృజనాత్మక రంగాల్లో ఉమ్మడి భాగస్వామ్యాలకు ఇది అద్భుతమైన అవకాశాలను సృష్టిస్తుంది. ఈ సవాళ్లలో గెలిచిన విజేతలను, వారి ప్రతిభను వేవ్స్ 2027 సదస్సులో భాగంగా నిర్వహించే క్రియేటోస్ఫియర్ వేదికపై ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు.

కృత్రిమ మేధ, డిజిటల్-సోషల్ మీడియా, యానిమేషన్, వీఎఫ్ఎక్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్, ఈ-స్పోర్ట్స్, కామిక్స్, ఎక్స్ఆర్/ఏఆర్/వీఆర్, సినిమాలు, బ్రాడ్‌కాస్టింగ్, సంగీతం-నృత్యం వంటి ఏ విభాగం నుంచైనా సంస్థలు తమ సవాలు ప్రతిపాదనలను పంపవచ్చు.

# మేడ్చల్‌లో కాంగ్రెస్ విభేదాలకు తెర..



మేడ్చల్, జులై 14: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీలో గత కొద్దిరోజులుగా నెలకొన్న విభేదాలు ఎట్టకేలకు సద్దుమరిగాయి. మేడ్చల్ డివిజన్ అధ్యక్ష పదవి వివాదంతో తీవ్ర అసంతృప్తికి లోనై, పార్టీకి రాజీనామా చేసిన స్థానిక కాంగ్రెస్ నేతలు ఎట్టకేలకు శాంతించారు. శనివారం రోజు జరిగిన కీలక పరిణామాల అనంతరం వారు తమ రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని పార్టీలోనే కొనసాగేందుకు మొగ్గు చూపారు.

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టేందుకు సీనియర్ నాయకులు రంగంలోకి దిగారు. వివాదాన్ని సద్దుమణిగించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత నక్క ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అసంతృప్తితో ఉన్న నాయకులతో ఆయన జరిపిన చర్చలు సఫలమయ్యాయి. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, విభేదాలను పక్కన పెట్టి ముందుకు సాగాలని కోరడంతో అసంతృప్త నేతలు మెత్తబడ్డారు.

గుండ్లపోచంపల్లి మాజీ డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఈ సంక్షోభానికి అధికారికంగా తెరపడింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ అంతర్గత పరిణామాల వల్ల కొంత అసంతృప్తి చెందినా, చివరకు పార్టీ ప్రయోజనాల కోసమే కలిసి నడవాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. సీనియర్ల సమక్షంలో జరిగిన ఈ చర్చలతో విభేదాలన్నీ పటాపంచలయ్యాయని, ఇకపై మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మరింత ఉత్సాహంగా పనిచేస్తుందని క్యాడర్ హర్షం వ్యక్తం చేసింది.

# అమ్మ పూజకు అనువైన మాసం ఆషాఢం





జ్యోతిష శాస్త్ర ప్రకారం ప్రతి మాసం నిర్ణయం ఆ మాసంలో పౌర్ణమి రోజున వచ్చే నక్షత్రం ఆధారంగా చేయబడుతుంది. చైత్ర పౌర్ణమి రోజున చంద్ర సంచారము చిత్తా నక్షత్రం అవుతుంది. కనుక ఆ మాసానికి చైత్ర మాసమని, విశాఖ నక్షత్రమందు సంచరించుట వల్ల వైశాఖ మాసం అని, ఇలా పన్నెండు మాసాలు పౌర్ణమిలలో చంద్రుని సంచారం ఆధారంగా పేర్లను నిర్ణయించారు. చంద్రుడు పౌర్ణమి రోజున పూర్వాషాఢ /ఉత్తరాషాఢ నక్షత్ర సమీపాన సంచరించే మాసం ఆషాఢ మాసం. దీనిని శూన్య మాసం అంటారు. వైశాఖ, జ్యేష్ట మాసాలు వివాహాలు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలతో కళకళలాడితే అషాఢమాసం వాటన్నింటికీ విరామం ప్రకటించే మాసం. ఆషాఢ మాసము తెలుగు సంవత్సరంలో నాలుగవ నెల. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెల, ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథునరాశి నుంచి కర్కాటకరాశి లోనికి ప్రవేశిస్తాడు. దాంతో దక్షిణాయనం మొదలవుతుంది. ఆషాఢ శుద్ధ ఏకాదశి నాడు విష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని "తొలి ఏకాదశి"గా పరిగణిస్తారు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున "గురు పౌర్ణమి"గా వ్యవహరిస్తారు. మహా భాగవతాన్ని రచించిన వేద వ్యాసుడు జన్మించిన రోజును "వ్యాస పౌర్ణమి" అని కూడా అంటారు. వ్యాసుడు వేదాల్ని నాలుగు భాగాలుగా విభజించిన రోజు కూడా ఇదేనంటారు. ఆషాడం నుండే దక్షిణాయనం, వర్షరుతువు ప్రారంభం అవుతాయి. సూర్యుడు కర్కాటక రాశి లోనికి ప్రవేశించడంతో ప్రారంభమయ్యే దక్షిణాయనం, తిరిగి మకర రాశి గతుడు కావడం వరకు, ఆరు మాసాలు ఉంటుంది. సూర్యుడు భూమధ్య రేఖకు దక్షిణంగా సంచరిస్తారు. దక్షిణాయనం ప్రీతికరం. ఉత్తరాయణం కన్నా దక్షిణాయణం లోనే పండుగలు, పబ్బాలు అధికం. ఆషాడంలో ప్రధానంగా, శుక్ల పక్ష విదియ నాడు జగన్నాథ, బలభద్ర, సుభద్ర, రథయాత్రలో నిర్వహిస్తారు. "ఆషాఢ శుద్ధ పంచమ్యాం, వచ్చెనే వృద్ధ గౌతమి... అథవా తప్పి దారేణా, ద్వాదశ్యామది తప్పదు". అని లోకోక్తి ఉంది. గోదావరి తీర వాసుల్లో పంచమి తప్పితే ద్వాదశి గోదావరి వరద రాగలరని భావన, స్కంద పంచమి నాడు సుబ్రమణ్య స్వామిని ఆరాధించే దినంగా "కుమార షష్టి"గా, "భాను సప్తమి" పర్వదినాలను ఆచరిస్తారు. దశమి నాడు మహాలక్ష్మి ఆరాధిస్తారు. ప్రధానంగా శుక్ల ఏకాదశి "తొలి ఏకాదశి" అంటారు. "మహా ఏకాదశి"గా "ప్రథమైకాదశి" గా "శయన ఏకాదశి" గా పిలువబడే ఈ దినం నాడు చాతుర్మాస దీక్షలు ప్రారంభిస్తారు. ఉత్తరాయణంలో పండగలు పబ్బాలు అధికం. అయితే



## విశిష్ట పండగలకు నెలవు ఆషాడం

దక్షిణాయనంలో ఆరోగ్య పరిరక్షణార్థం, నియమాలు ఎక్కువగా పాటించాల్సిన సమయంలో, పూర్వీకులైన పెద్దలు, వ్రతాలు ఉత్సవాలు ఎక్కువ పెట్టారు. వాటికి బోణీ వంటిది తొలి ఏకాదశి. త్రైమూర్త్య స్వరూపుడైన గురువును పూజించే దినం "గురు పూర్ణిమ" లేదా "వ్యాస పూర్ణిమ". తెలంగాణలో ఆషాడంలో "బోనాల పండుగ" జరుపు కోవడం, అనాది నుండి వస్తున్నది. భోజనానికి వికృతి అయిన బోనాన్ని అమ్మవారికి నివేదించడం గ్రామీణ ఆచారం. హైదరాబాదు, సికింద్రాబాదు, తెలంగాణ, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలలో ఆషాఢ మాసంలో బోనాలు పండుగ జరుపుకో బడుతుంది. మార్పు వల్ల, ఆరోగ్యానికి హాని చేకూర్చే వ్యాధుల నుండి కాపాడే, అన్నం, బెల్లం, పెరుగు, పసుపు నీళ్ళు, వేపాకులు, బోనాల్లో చేరుస్తారు. రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యే కాలమిది. గ్రామీణులు వ్యవసాయ పనులకు వెళుతూ, తీరిక లేకుండా పని చేయాల్సి ఉన్నందున, విత్తడానికి అనువైన కాలం అయినందున, వైవాహిక జీవితం ధ్యాస నుండి మళ్ళించేందుకు, అత్తవారింటికి అల్లుడు వెళ్లకూడదనే నియమం పెట్టారు. పూర్వకాలంలో వ్యవసాయమే జీవనాధారం. సంపాదన మాట అటు నుంచి తినడానికైనా కొన్ని గింజలు ఉండాలని, కొత్త వలపు మోజులో పడి జీవనాధారమైన వ్యవసాయాన్ని ఎక్కడ నిర్లక్ష్యం చేస్తారో. అనీ ఈ నిబంధన పెట్టారు. అంతే కాదు ఈ మాసంలోని వాతావరణంలో చాలా మార్పులు చోటు చేసుకుటాయి. చల్లని వాతావరణం వల్ల బ్యాక్టీరియా, వైరస్లు అంటువ్యాధులుగా బాగా ప్రబలుతాయి. ఇలాంటి సమయంలో కొత్త పెళ్ళి కూతురు గర్భం దాల్చితే, పుట్టబోయే బిడ్డమీద వాటి ప్రభావం ఉంటుందనేది శాస్త్రీయ నమ్మకం. పిండానికి తొలి మూడు నెలలు చాలా ముఖ్యం. ఆ సమయంలోనే అవయవాలు ఏర్పడతాయి. జన్మించిన సమయం కన్నా, గర్భధారణ సమయం ముఖ్యమని పూర్వకాలంలో భావించేవారు. ఆషాఢంలో గర్భం దాల్చితే తొమ్మిది నెలలకి అంటే చైత్రం పూర్తవుతుంది. ఆ సమయంలో ఎండకు పుట్టిన పిల్లలు, బాలింతలు తట్టుకోలేదని ఈ నియమం పెట్టారు. అలాగే ఒక నెల వియోగం తర్వాత కలుసుకుంటే అన్యోన్యత దాంపత్యాన్ని పొందుతారని అని కూడా అంటారు. కావున ఈ నెలలో వధువు పుట్టింట్లో ఉండడమే క్షేమమని, పెద్దలు ఆధారంగా పెట్టారు. దీన్ని అనారోగ్య మానంగా పేర్కొంటారు. అందుకే కొత్తగా వివాహం అయిన నవ వధువులు, అత్త వారిళ్ళలో కాకుండా, తల్లిగారిళ్ళలో నెల రోజులు ఉండే సంప్రదాయం, ఇంకా కొనసాగుతూనే ఉంది. ఆషాఢ మాసంలో నవదంపతులు కలవ కూడదనే ఆచారాన్ని మనదేశం లోని హైందవేతర మతస్తులు కూడా కొన్నిచోట్ల పాటిస్తుంటారు. ఈ మాసంలో పాదరక్షలు, గొడుగు, ఉప్పు, దానం చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. స్నానం, దానం జపం సత్కర్మల ఆచరణకు ముఖ్యమైన మాసం. గృహ నిర్మాణ ఆరంభాలకు శుభ సూచకమైన మాసంగా చెప్పబడింది. ఆషాఢంలో గృహ నిర్మాణం ప్రారంభిస్తే భృత్య, రత్న, పశు ప్రాప్తి కలుగుతుందని మత్స్యపురాణం వివరిస్తున్నది. ఆషాడంలో ఒక్కసారైనా గోరింటాకు పెట్టుకోవడం, ములగ కూర తినడం, అనప పప్పు వాడకాలు, ఆచారాలు ఉన్నాయి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# జగన్నాథ రథయాత్ర ఏర్పాట్లను ప్రశంసించిన జిల్లా కలెక్టర్ చిత్రానికి మిశ్రా



హైదరాబాద్, జులై 14:16 జూలై 2026 రోజు కరీంనగర్ పురవీధుల్లో తలపెట్టిన జగన్నాథ రథయాత్రకు కావలసిన అన్ని ఏర్పాట్లను పెద్దఎత్తున చేస్తున్నామని జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వివరించారు. ఈ రోజు జగన్నాథ రథయాత్ర ఉత్సవ కమిటీ అధ్యక్షులు కన్నా కృష్ణ నేతృత్వంలో సభ్యులు కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిసి ఆహ్వాన పత్రం అందజేసిన సందర్భంగా సంతోషం వ్యక్తం చేసి తాను కూడా పాల్గొంటానని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో కరీంనగర్ హిందూ సమాజం వేల సంఖ్యలో పాల్గొనే ఈ రథయాత్రకు జిల్లా యంత్రాంగం పూర్తిగా సహకరిస్తున్నారని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు వివరించారు. రథయాత్ర ప్రారంభోత్సవంలో మహాశక్తి దేవాలయానికి మధ్యాహ్నం 1 గంటకు రావలసిందిగా కమిటీ కోరగా అంగీకారం తెలిపారు.

ఈ సమావేశంలో జగన్నాథ రథయాత్ర కమిటీ పక్షాన కన్న కృష్ణ, డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, రాళ్లబండి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొని కలెక్టర్‌ను ఆహ్వానించారు.

## 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్షిప్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ.




కరీంనగర్, జులై 14: (నేటినిజం ప్రతినిధి) 18, 19 తేదీల్లో కరీంనగర్ వేదికగా పోటీలు నేటి నిజం కరీంనగర్ ప్రతినిధి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న 4వ ఆల్ ఇండియా ఓపెన్, జూనియర్ చెస్ చాంపియన్షిప్?2026 వాల్ పోస్టర్‌ను మంగళవారం జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి వి. శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెస్ మేధో వికాసానికి దోహదపడే అత్యుత్తమ క్రీడ అని, ఇలాంటి జాతీయ స్థాయి టోర్నమెంట్ల నిర్వహణ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునే మంచి అవకాశం లభిస్తుందని అన్నారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. టోర్నమెంట్ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. విజేతలకు మొత్తం రూ.1,25,000 నగదు బహుమతులు, ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భరోసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నాగరాజు, జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, టోర్నమెంట్ నిర్వాహకులు సృజన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ యుద్ధం లాంటిది

మెదక్, జులై 14:ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఒక యుద్ధం లాంటిదని, దానిని విజయవంతం చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని తెలంగాణ సాంస్కృతిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల గద్దర్ పిలుపునిచ్చారు. సోమవారం సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా వ్యవహరించాలని సూచించారు. బీఎల్‌వోలు తమ వద్దకు వచ్చే వరకు ఎదురుచూడకుండా కార్యకర్తలే ముందుగా వెళ్లి ఓటర్లకు సహకరించాలని తెలిపారు.

ఓటు నమోదు కాకపోతే వ్యక్తిగతంగా ఓటరే నష్టపోతాడని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకునే విషయంలో ఆసక్తి, బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. డీసీసీ అధ్యక్షురాలు నిర్మలరెడ్డి మాట్లాడుతూ, రానున్న ఐదు రోజుల్లోనే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పూర్తిచేసేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఇది పార్టీ కార్యక్రమం మాత్రమే కాకుండా సంగారెడ్డి ప్రజల కోసం చేస్తున్న బాధ్యతగా భావించి ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్లు కూన వనిత, అంజమ్మ, నాయకులు కూన సంతోష్, షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్, రఘు గౌడ్, జార్జ్ మాథ్యూస్, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గంగేరి శ్రీహరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఆగొద్దు

## -ఆర్టీజీఎస్ సమీక్షలో ఏపీ సీఎం దిశానిర్దేశం




అమరావతి, జులై 14:ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయం, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్ధిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు.

శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్ధిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ దట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారధి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నిజామాబాద్ జిల్లా పోలీసుల నుండి తప్పించుకుపోయి.. మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన దోపిడీ ముఠా

నిజామాబాద్, జులై 14:తెలంగాణలోని నిర్మల్, నిజామాబాద్ రెండు జిల్లాల్లో గత మూడు రోజుల క్రితం దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా మన పోలీసులకు చిక్కకుండా చేజారిపోయారు. శుక్రవారం అర్ధరాత్రి అనంతరం నుండి శనివారం తెల్లవారుజాము వరకు నిర్మల్ జిల్లాతో పాటు నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ పట్టణం, మాక్లూర్ మండలంతోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని దుబ్బ ప్రాంతంలో వరుస చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా వచ్చిన టాటా సుమో మహారాష్ట్ర ప్రాంతంలోని ఓ చోట దొంగతనం చేసి తీసుకువచ్చిందిగా పోలీసుల దర్యాప్తులో తేలింది. వారు వచ్చిన టాటా సుమో వాహనం ఆర్మూర్ పట్టణంతోపాటు నిజామాబాద్ నగరంలో సైతం పలు ప్రాంతాలలో సీసీ కెమెరాలకు చిక్కింది. దొంగిలించిన వాహనంలో మొత్తం ఆరుగురు గ్యాంగ్ వచ్చినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. .

ఈ చోరీలపై సీరియస్ గా పరిగణించిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి అంతర్ రాష్ట్ర ముఠాను పట్టుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం నుండే నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రత్యేక పోలీసు బృందాలు తెలంగాణలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్రకు సైతం వెళ్లి దుండగుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఆ అంతరాష్ట్ర ముఠా సభ్యులు మన జిల్లా పోలీసులకు పట్టు పడకుండా ఇక్కడ నుండి నేరుగా మహారాష్ట్ర ప్రాంతానికి పరారయ్యారు. ఆ ప్రాంతంలో నీవు చోట వారు ప్రయాణం చేసిన టాటా సుమో దొంగిలించిన వాహనాన్ని వదిలేసి, అక్కడి నుండి మరో (బొలెరో) వాహనాన్ని దొంగిలించి ఆ వాహనంలో అక్కడి నుండి పరారయ్యారు. ఆదివారం



రాత్రి మహారాష్ట్రలోని హైమద్ నగర్ జిల్లా ఒట్టురు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గోల్డ్ షాప్ లో సైతం మరో దోపిడీకి పాల్పడినట్లు సమాచారం.

అక్కడినుండి మరోచోట ఓ ఇంట్లో చోరీకి యత్నించగా, అప్పటికే నిజామాబాద్ జిల్లా పోలీస్ అధికారుల సమాచారంతో అప్రమత్తమైన మహారాష్ట్ర పోలీస్ బృందాలు చివరకు ఆ దోపిడీ దొంగలను అక్కడ పట్టుకున్నట్లు తెలిసింది. మహారాష్ట్ర పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర దోపిడీ ముఠాపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసు అధికారులు తెలిపారు. అయితే రెండు రోజులపాటు రాత్రింబవళ్లు అంతర్రాష్ట్ర దోపిడీ ముఠా కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిన నిజామాబాద్ జిల్లా పోలీసులకు చివరకు నిరాశే మిగిలింది. నిజామాబాద్ జిల్లా పోలీసులకు దోపిడీ ముఠా పట్టుబడి ఉంటే, ఇక్కడ చోరీల లో దొంగిలించిన సొత్తు రికవరీ అయ్యేదని, ప్రస్తుతం వారు మహారాష్ట్ర పోలీసుల అదుపులో ఉండడంతో మన దగ్గర జరిగిన చోరీల సొత్తు రికవరీలో టైం పడుతుందని పోలీసు అధికారులు తెలిపారు. ప్రస్తుతం మహారాష్ట్ర జైల్లో ఉన్న నిందితులను కోర్టులో పిటిషన్ వేసి, నిజామాబాద్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకొని, వారిని విచారించి అనంతరం వారి ద్వారా చోరీ సొత్తును రికవరీ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.